E KABURU - Digital News Paper  E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

హైదరాబాద్ (తేదీ) 24-03-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:81 || పేజీలు–6

www.ekaburu.com

# యుద్ధానికి బ్రేక్..



- ఇరాన్‌పై దాడులకు 5 రోజుల విరామం: ట్రంప్
- ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నామన్న అమెరికా అధ్యక్షుడు
- 'ముఖ్య నేత'తో విట్కాఫ్, కుష్నర్ చర్చిస్తున్నట్టు వెల్లడి
- అలాంటిదేమీ లేదని తోసిపుచ్చిన ఇరాన్
- తమ హెచ్చరికలకు భయపడే ట్రంప్ దిగొచ్చారని వ్యాఖ్య
- అమెరికా తమతో నేరుగానే చర్చించాలని స్పష్టీకరణ

'పశ్చిమాసియాలో కల్లోలానికి పూర్తిగా తెర దించే దిశగా ఇరాన్, అమెరికా నడుమ రెండు రోజులుగా ఫలప్రదంగా చర్చలు జరుగుతున్నాయని చెప్పేందుకు సంతోషిస్తున్నా. ఎంతో లోతుగా, సవివరంగా జరుగుతున్న ఈ నిర్మాణాత్మక చర్చలు వారమంతా కొనసాగుతాయి. తద్వారా సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నా. అందుకే ఇరాన్ విద్యుత్కేంద్రాలు, చమురు వ్యవస్థలపై ఐదు రోజుల పాటు ఎలాంటి దాడులూ చేయొద్దని మా యుద్ధ విభాగాన్ని ఆదేశించా. అయితే ఈ విరామం చర్చలు ఏ మేరకు ఫలప్రదమవుతాయనే దానికి లోబడి ఉంటుంది"

– ట్రూత్‌సోషల్ పోస్టులో అధ్యక్షుడు ట్రంప్

**ఈ-కబురు, దుబాయ్:** మూడు వారాలకు పైగా కొనసాగుతున్న పశ్చిమాసియా కల్లోలానికి తెర దించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్‌తో రెండు రోజులుగా చర్చలు జరుగుతున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. అవి ఈ వారమంతా కొనసాగుతాయని ప్రకటించారు. సోమవారం ట్రూత్‌సోషల్‌లో ఈ మేరకు పోస్టు చేశారు. చర్చల నేపథ్యంలో ఇరాన్‌లోని కీలక విద్యుత్కేంద్రాలు, చమురు వ్యవస్థలపై దాడులను ఐదు రోజుల పాటు నిలిపేయనున్నట్టు ప్రకటించారు. హోర్ముజ్ జలసంధిని 48 గంటల్లో తెరవని పక్షంలో ఇరాన్ చమురు, విద్యుత్ వ్యవస్థలపై భారీగా విరుచుకుపడతామని ఆదివారం ట్రంప్ అల్టిమేటం జారీ చేయడం తెలిసిందే. అదే జరిగితే హోర్ముజ్‌ను పూర్తిగా మూసేయడమే గాక గల్ఫ్‌లోని అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలు, మౌలిక సదుపాయాలు, ఐటీ సెంటర్లు, నీటి శుద్ధి కేంద్రాలు తదితరాలన్నింటినీ సర్వనాశనం చేస్తామని ఇరాన్ బెదిరింపులకు దిగింది. ఈ నేపథ్యంలో ఉద్రిక్తతలను తగ్గిస్తూ ట్రంప్ నుంచి 'చర్చల ప్రకటన' వెలువడింది. అయితే దాన్ని ఇరాన్ ఖండించడం విశేషం. అమెరికాతో అలాంటి చర్చలేవీ జరగడం లేదని ఇరాన్ విదేశాంగశాఖ పేర్కొంది.

మిగతా 2లో

# ప్రజలకు నష్టం చేయం



- మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు పునరావాసం కల్పిస్తాం: సీఎం రేవంత్
- గిగ్ వర్కర్ల బిల్లుకు తెలంగాణ క్యాబినెట్ ఆమోదం
- మెరుగైన వసతులు ఏర్పాటు చేసి తరలిస్తాం
- ఉసిగొల్పే వాళ్ల ఉచ్చులో పడొద్దు.. పార్టీలు అపోహలు సృష్టించకూడదు
- మీరు సలహాలు ఇస్తే తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటాం..
- అందరం కలిసి హైదరాబాద్‌ను అద్భుతంగా అభివృద్ధి చేసుకుందాం
- శాసనమండలిలో ముఖ్యమంత్రి

ఈకబురు, హైదరాబాద్: 'మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలెవ్వరికీ నష్టం చేయం. నిరాశ్రయులను చేయం. పునరావాసం కల్పిస్తాం. మెరుగైన వసతులు ఏర్పాటు చేసి తరలిస్తాం. ప్రాజెక్టును నిర్మిస్తూనే అక్కడ నష్టపోయే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. విద్య, వైద్యం వంటి సదుపాయాలు కల్పిస్తాం. బఫర్ జోన్‌లో ఉండే వారికి ఏ రకంగా సహాయం అందించాలో అందిస్తాం. రాజకీయ ప్రయోజనాల కోసం మిమ్మల్ని ఉసిగొల్పే వాళ్ల ఉచ్చులో పడొద్దు. రాజకీయ పార్టీలు కూడా ప్రజల్లో అపోహలు సృష్టించకూడదు. అందరం కలిసి హైదరాబాద్ నగరాన్ని అద్భు తంగా అభివృద్ధి చేసుకుందాం..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, అద్దంకి దయాకర్ సోమవారం శాసనమండలిలో అడిగిన ప్రశ్నకు సీఎం సుదీర్ఘంగా సమాధానమిచ్చారు.

**కావాలంటే కేబినెట్ కమిటీ వేస్తాం..**

'మూసీ ప్రాజెక్టును ఆపాలన్న ఆలోచన నుంచి బయటకు రండి. ముందుకు తీసుకెళ్లడానికి సలహాలు ఇవ్వండి. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రారంభించింది తామే అని సిరిసిల్ల ఎమ్మెల్యే చెప్పారు. మూసీ నది వెంట 50 మీటర్ల బఫర్ జోన్ కూడా మీరు నిర్ణయించిందే. మీరు ప్రారంభించి అర్థాంతరంగా వదిలేసిన పనినే మేం ముందుకు తీసుకెళుతున్నాం. ఈ విషయంలో మీరు ఏ సూచన చేసినా పరిగణనలోకి తీసుకుంటాం. ప్రజలకు ఉపయోగపడేవి అయితే 100% అమలు చేస్తాం. నాకు సూచనలు ఇవ్వడానికి ఏదైనా ఇబ్బంది ఉంటే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కేబినెట్ సబ్ కమిటీ వేస్తాం. ఆ కమిటీకి మీ సూచనలు చెప్పొచ్చు.

**ప్రాణాంతకంగా మూసీ నీళ్లు**

నల్లగొండ జిల్లా ప్రజల కష్టాలను చూస్తే మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును ఎవరూ అడ్డుకోరు. రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ నగరంలో కాలుష్యం, జంతువుల కళేబరాలు, మనుషుల శవాలతో ఆ నీళ్లు వారికి ప్రాణాంతకంగా మారాయి. ఆ ప్రాంతంలో పండిన పంటలు, బోర్లలో నీళ్లు కూడా పిల్లలపైన విపరీతమైన ప్రభావం చూపిస్తున్నాయి.

మిగతా 2లో



3

## ప్రభుత్వం చేతికి మెట్రోరైలు సంస్థ!

**రూ.15 వేల కోట్లతో పూర్తి వాటా కొనుగోలు**

ఈ కబురు ,హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) నుంచి తెలంగాణ ప్రభుత్వపరం కానుంది. ఎల్అండ్‌టీ మెట్రోరైలు హైదరాబాద్ లిమిటెడ్‌లో నూరుశాతం వాటాను అప్పులతో కలిపి రూ.15,000 కోట్లకు కొనుగోలు చేయనుంది.



4

## 'వాహన్' పోర్టల్‌లో చేరిన తెలంగాణ

ఈ కబురు ,హైదరాబాద్:ఇకపై రెండు, అంతకంటే ఎక్కువ వాహనాలు ఒకే వ్యక్తి కొనుగోలు చేసినా 2 శాతం అదనపు పన్ను ఉండదని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎన్ని వాహనాలు కొనుగోలు చేసినా అదనపు పన్ను ఉండదని స్పష్టం చేశారు.


# ఈ రబీలోనూ ప్రతి గింజ కొంటాం

**ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతుల్లో మధ్యవర్తి ఎవరూ లేరు**

ఈ కబురు ,హైదరాబాద్: తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు చేయడంలో భారీ కుంభకోణం జరిగిందని భారాస సభ్యుడు హరీశ్‌రావు ఆరోపించడంతో పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి.. హరీశ్ మధ్య పరస్పర మాటల యుద్ధం సాగింది. రాష్ట్రం నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులపై అసెంబ్లీలో సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో భారాస సభ్యులు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కమలాకర్‌లు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఆయన సిఫార్సు చేసిన పనిని అధికారులు చేయకపోతే కుంభకోణమని అనడం హరీశ్‌రావుకు అలవాటేనని మంత్రి వ్యాఖ్యానించారు. బియ్యం ఎగుమతుల్లో స్కామ్ జరిగిందన్నది నిరాధార ఆరోపణలన్నారు.



మిగతా 3లో



# లోక్‌సభ.. అసెంబ్లీ స్థానాలు 50% పెంపు

**అప్పుడు తెలంగాణలో 179, ఏపీలో 263 శాసనసభ సెగ్మెంట్లు**

- 2029 ఎన్నికల నుంచి అమల్లోకి!
- దేశంలో 543 నుంచి 816కి లోక్‌సభ స్థానాలు
- ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు
- ఎన్డీయే భాగస్వాములకు చెప్పిన అమిత్‌షా
- ముందుగానే మహిళా రిజర్వేషన్ కోటా

ఈ కబురు , దిల్లీ: లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50% పెంచాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లును ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి సిద్ధమైనట్లు తెలిసింది.

మిగతా 2లో



# యుద్ధం మానవాళికి శ్రేయం కాదు

**పశ్చిమాసియా పరిస్థితులతో మనకూ సవాళ్లు: మోదీ**

ఈ కబురు ,దిల్లీ: మానవాళి ప్రయోజనాలకు యుద్ధం ఏమాత్రం శ్రేయం కాదని, అందువల్ల శాంతియుత పరిష్కారం వైపు ఆయా పక్షాలను ప్రోత్సహించేలా మనదేశం ప్రయత్నిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. "మనది ఎప్పుడూ శాంతి మార్గమే. సమస్యకు పరిష్కారం చర్చలు, దౌత్యమే. ఉద్రిక్తతలను, పశ్చిమాసియాలో ఘర్షణను తగ్గించడం ధ్యేయంగా మనం కృషి చేస్తున్నాం'' అని సోమవారం లోక్‌సభలో ఆయనొక ప్రకటన చేశారు. వాణిజ్య నౌకలపై దాడులు, హర్మూజ్ జలసంధి మీదుగా రాకపోకలకు అవాంతరం కలిగించడం ఆమోదయోగ్యం కాదని స్పష్టంచేశారు.

02



## 'వనవాసి' మాట గిరిజన హక్కుల్ని కాలరాయడానికే

03

## విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

- ప్రమాదాల్లో మరణించిన ఇద్దరు ఉద్యోగుల కుటుంబాలకు అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- సర్వేలో గుర్తించిన కుటుంబాలకు రూ.5 లక్షల బీమా వర్తింపజేస్తామని వెల్లడి



02



## రైతు రుణమాఫీ మా పరిశీలనలో లేదు

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ

02



# ఉద్యోగుల డీఏ, పీఆర్‌సీలపై.. భట్టి X హరీశ్

- మానవీయ కోణంలో సమస్యలను పరిష్కరిస్తున్నాం
- ప్రతినెలా పెండింగ్ బిల్లులకు రూ.1000 కోట్లు విడుదలచేసే యోచన
- గత సర్కారు ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దుతున్నాం: ఉప ముఖ్యమంత్రి భట్టి
- ప్రభుత్వ మానవీయత మాటల్లోనే.. చేతల్లో లేదు: హరీశ్‌రావు
- సరైన సమాధానం ఇవ్వలేదంటూ భారాస వాకౌట్

ఈ కబురు , హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏల పెండింగ్.. కొత్త పీఆర్‌సీ అమలు.. పెన్షనర్లకు పదవీ విరమణ ఆర్థిక ప్రయోజనాల చెల్లింపు.. తదితర అంశాలపై శాసనసభలో సోమవారం వాడీవేడి చర్చ సాగింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, భారాస సభ్యుడు హరీశ్‌రావుల మధ్య మాటల యుద్ధం సాగింది. తమ సర్కారుది మానవీయ కోణమని భట్టి చెబితే.. అది మాటల్లో తప్ప..

మిగతా 3లో



## భాజపా అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం

- వివిధ మార్గాల నుంచి వచ్చిన నాయకులు
- ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్న పోలీసులు

02

## ఫార్ములా ఈకార్ రేసు కేసులో ఏ1గా కేటీఆర్

- ఏ2గా ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్
- ఛార్జిషీట్ దాఖలు చేసిన ఏసీబీ

ఈ కబురు ,హైదరాబాద్: రాష్ట్రంలో దుమారం రేపిన ఫార్ములా ఈ-కార్ రేసు కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఏ1గా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బి.ఎల్.ఎన్.రెడ్డి, ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావు, ఏ5గా యూకేకు చెందిన ఎఫ్ఈవో(ఫార్ములా-ఈ ఆపరేషన్స్) సంస్థను పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రూ.55 కోట్లను విదేశీ సంస్థలకు నేరుగా మళ్లించినట్లు అభియోగపత్రంలో పేర్కొన్నారు.



02

## ఏడాది కాలంగా రోహిత్‌రెడ్డికి డ్రగ్స్

ఈ కబురు ,హైదరాబాద్- మొయినాబాద్, రాజేంద్రనగర్, శంషాబాద్, న్యూస్‌టుడే: భారాస మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో డ్రగ్స్ పార్టీ, పోలీసులపైకి కాల్పుల కేసులో కొత్త పేర్లు, లింకులు బయటపడుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన డ్రగ్స్ పెడ్లర్ రాకేశ్‌వర్మ, ఇత



03

# లోక్‌సభ.. అసెంబ్లీ స్థానాలు 50% పెంపు




దీని ప్రకారం పార్లమెంటు స్థానాలు 543 నుంచి 816కి చేరుతాయి. 4,123 ఉన్న అసెంబ్లీ స్థానాలు 6,185 అవుతాయి. తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 ఎమ్మెల్యే స్థానాలు 263కి చేరుతాయి. లోక్‌సభ స్థానాలు ఏపీలో 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి చేరే అవకాశం ఉంటుంది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని సోమవారం సాయంత్రం ఎన్డీయే సమావేశంలో భాగస్వామ్య పక్షాలకు కేంద్రం చెప్పింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌ల నేతృత్వంలో ఈ భేటీ జరిగింది. కాంగ్రెసేతర విపక్షాలతోనూ విడిగా భేటీ నిర్వహించారు. కాంగ్రెస్‌తోనూ షా మాట్లాడే అవకాశం ఉంది. నియోజకవర్గాల సంఖ్య పెంచడానికి వీలుగా ముందుగా మహిళా రిజర్వేషన్ చట్టం, డీలిమిటేషన్ చట్టాలకు సవరణలు ప్రతిపాదిస్తూ ఈ పార్లమెంటు సమావేశాల్లో బిల్లులు తీసుకురాబోతున్నట్లు తెలిసింది. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయని సమాచారం.

--ప్రాథమిక జనాభా లెక్కల వివరాలతోనే..

2023 సెప్టెంబరులో ఆమోదించిన బిల్లు ప్రకారం 2034 నుంచి మహిళలకు 33% రిజర్వేషన్లు అమల్లోకి రావాలి. రాజ్యాంగ అధికరణలు 170(3), 81(3) ప్రకారం.. 2026 తర్వాత ప్రచురించే జనాభా లెక్కల ఆధారంగా దేశంలో నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిబంధన ఉంది. అందువల్ల కేంద్రం మహిళా రిజర్వేషన్ల అమలును 2034 నుంచి అమల్లోకి తేనుంది ఇదివరకు భావించారు. ఇప్పుడు జనగణన 2027 మార్చి 1కల్లా పూర్తికానుండటంతో ప్రాథమిక జనాభా లెక్కల వివరాలు ప్రకటించి.. ఆ వెంటనే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టొచ్చు. ఈ అంశంపై అన్ని పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు మొదలుపెట్టింది. జనగణన తర్వాత అందులో వచ్చిన లెక్కల ఆధారంగా దామాషా ప్రకారం సీట్ల పెంపునకు అనుమతిస్తే ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య తేడా వచ్చే అవకాశం ఉందని తొలినుంచి దక్షిణాది రాజకీయపార్టీలు ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో.. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్‌సభ, అసెంబ్లీ సీట్లు 50% పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనివల్ల అన్ని రాష్ట్రాలకూ ఇప్పుడున్న రాజకీయ ప్రాతినిధ్యం యథాతథంగా కొనసాగే అవకాశం ఉంటుందని సమాచారం. ప్రభుత్వ ప్రతిపాదనపై స్పందించడానికి రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో మంగళవారం విపక్షనేతలు సమావేశం కానున్నారు.

# యుద్ధం మానవాళికి శ్రేయం కాదు



ఆ ప్రాంతం మీదుగా నౌకలు రావడం ఎంతో సవాల్‌గా మారినా తమ ప్రభుత్వ ప్రయత్నాలతో పెద్దగా అవాంతరం లేకుండా ఇంధనాలు సరఫరా అవుతున్నాయని చెప్పారు. సాధారణ కుటుంబాల వారు అతితక్కువ ఇబ్బందితో బయటపడేలాచేసే చర్యలన్నీ చేపట్టినట్లు తెలిపారు. చమురు, గ్యాస్ అవసరాలు తీర్చేందుకు వేర్వేరు దేశాల సరఫరాదారులతో ప్రభుత్వం సంప్రదింపులు సాగిస్తోందని చెప్పారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లోని భారతీయుల్లో ప్రతి ఒక్కరికీ సాధ్యమైనంతమేర సాయం అందిస్తున్నామని తెలిపారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడినుంచి స్వదేశానికి చేరుకున్నారని చెప్పారు.

ఎల్పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం

''యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలున్నాయి. దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ఇదివరకు 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. గత 11 ఏళ్లలో ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచే దిశగా కృషి చేస్తున్నాం. అన్ని విద్యుదుత్పత్తి కేంద్రాల్లో బొగ్గు నిల్వలు సరిపడా ఉన్నాయి. ఆహారభద్రత పరంగానూ సన్నద్ధతతో ఉన్నాం. మన రైతులు ధాన్యాగారాలన్నీ ఇప్పటికే నింపేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయ నౌకలు సురక్షితంగా తిరిగేలా చూసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. గల్ఫ్ దేశాల్లో దాదాపు కోటిమంది భారతీయులు ఉంటున్నందువల్ల పశ్చిమాసియా మనకెంతో ముఖ్యమైనది. అందువల్ల ప్రస్తుత ఘర్షణ ఆందోళనకరమే. పార్లమెంటు ద్వారా మన ఏకాభిప్రాయాన్ని ప్రపంచానికి చేర్చాల్సిన ఆవశ్యకత ఉంది'' అని మోదీ

# భాజపా అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం



ఈ కబురు ,హైదరాబాద్: ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ భాజపా ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భాజపా నాయకులు జట్లుగా విడిపోయి అసెంబ్లీ వైపు దూసుకొచ్చారు. ఒకరిని అరెస్టు చేసి వ్యానులో ఎక్కించగానే మరో జట్టు రావడంతో పోలీసులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. చాలామంది నాయకులు ఆటోలు, బస్సుల్లో, ద్విచక్రవాహనాలపై అసెంబ్లీ వరకు చేరుకొని లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పోలీసుల కళ్లుగప్పి ఆటోలో సామాన్యుడిలా అసెంబ్లీ వరకు వచ్చారు. చివరకు ఆయనను పోలీసులు గుర్తించి బలవంతంగా పోలీసు వాహనంలో స్థానిక ఠాణాకు తరలించారు. యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్, భాజపా నేతలు గౌతంరావు, టి.వీరేందర్‌గౌడ్, ఝాన్సీ తదితరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి 27 నెలలవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలు నెరవేర్చలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప, మిగతా గ్యారంటీలన్నింటినీ పక్కనపెట్టింది. రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు సరిగా నిధులు కేటాయించలేదు. హైదరాబాద్ అభివృద్ధికి మొండిచేయి చూపించారు. రైతులకు రైతుభరోసా, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ తప్పిదాలను ఎండగట్టేందుకు అసెంబ్లీ ముట్టడి చేపట్టాం. మమ్మల్ని బలవంతంగా అదుపులోకి తీసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత, నిరంకుశ ధోరణికి నిదర్శనం. ప్రజల పక్షాన తమ పోరాటం ఆగదు' అని పేర్కొన్నారు

# యుద్ధానికి బ్రేక్..



బహుశా అంతర్జాతీయంగా చుక్కలనంటుతున్న చమురు ధరలను తగ్గించేందుకు, తదుపరి యుద్ధ వ్యూహాల అమలుకు సమయం తీసుకునేందుకే ట్రంప్ ఇలాంటి ప్రకటన చేసి ఉంటారంటూ అనుమానాలు వెలిబుచ్చింది. ''యుద్ధాన్ని మొదలుపెట్టింది అమెరికాయే. కనుక ఆ దేశమే నేరుగా మాతో చర్చలకు రావాలి''అంటూ డిమాండ్ చేసింది.

కానీ ఆ తర్వాత ట్రంప్ ఫ్లోరిడాలో మీడియాతో మాట్లాడుతూ ఇరాన్ వ్యాఖ్యలను తోసిపుచ్చారు. చర్చలు కొనసాగుతున్నట్లు పునరుద్ఘాటించారు. ''ఇరాన్ అగ్రనాయకత్వం తుడిచిపెట్టుకుపోయినా పరిణతి, గౌరవాదరాలున్న పలువురు నేతలు ఆ దేశంలో ఉన్నారు. అలాంటి ఒక ఇరాన్ నాయకునితో అమెరికా దూతలు చర్చలు జరుపుతున్నారు''అని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమాసియా ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, తన అల్లుడు జరేద్ కుష్నర్ ఓ ఇరాన్ నేతతో ఆదివారం రాత్రి పొద్దుపోయేదాకా చర్చించినట్టు వివరించారు. ఆ నేత ఎవరన్నది వెల్లడించకపోయినా, సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ అయితే కాదని స్పష్టం చేశారు. మొజ్తబా పేరిట అప్పుడప్పుడూ ప్రకటనలు రావడమే తప్ప ఆయన బతికున్నదీ లేనిదీ కూడా అనుమానమేనన్నారు. ఇరాన్‌కు కూడా ఒక ఒప్పందానికి రావాలనే ఉందని అధ్యక్షుడు చెప్పుకొచ్చారు. ''చర్చలు మంగళవారం కూడా కొనసాగుతాయి. అవి ఫలిస్తే త్వరలోనే హోర్ముజ్ తెరుచుకుంటుంది. చమురు ధరలు ఒక్కసారిగా దిగొస్తాయి. అంతేకాదు, ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియం నిల్వలను అమెరికా స్వాధీనం చేసుకుంటుంది కూడా''అని ఆశాభావం వెలిబుచ్చారు. చర్చలు విఫలమైతే మాత్రం ఇరాన్‌పై క్షిపణులు, బాంబుల వర్షాన్ని కొనసాగిస్తామని ట్రంప్ హెచ్చరించడం విశేషం.

అమెరికా, ఇరాన్ చర్చలకు రెండు రోజులుగా టర్కీ, ఈజిప్ట్, పాకిస్తాన్ మధ్యవర్తిత్వం వహిస్తున్నట్టు ఆక్సియోస్ వార్తా సంస్థ పేర్కొంది. అటు విట్కాఫ్, కుష్నర్‌తో, ఇటు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీలతో మూడు దేశాల విదేశాంగ మంత్రులు విడివిడిగా మంతనాలు జరుపుతున్నట్టు వెల్లడించింది. టర్కీ విదేశాంగ మంత్రితో తాను చర్చలు జరిపినట్టు అరాఘ్చీ ధ్రువీకరించారు. కరడుగట్టిన మతవాదిగా పేరుబడ్డ ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బఘేర్ గలీబాఫ్‌తో కూడా విట్కాఫ్, కుష్నర్ చర్చలు జరిపినట్టు వార్తలు వెలువడుతుండటం విశేషం. ఇజ్రాయెల్ మీడియా కూడా వీటిని ధ్రువీకరించింది. మరోవైపు, ఇరాన్ హెచ్చరికల కారణంగానే ట్రంప్ దిగొచ్చారంటూ ఆ దేశ అధికారిక వార్తా సంస్థ పేర్కొంది. ట్రంప్ తాజా ప్రకటనతో చమురు ధరలు కాస్త దిగొచ్చాయి.

యథావిధిగా దాడులు

ట్రంప్ ప్రకటనతో నిమిత్తం లేకుండా ఇజ్రాయెల్ మాత్రం ఇరాన్‌పై దాడుల పరంపరను కొనసాగించింది. ఆయన ప్రకటన వెలువడ్డ నిమిషాల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా పలు నగరాలపై సోమవారం క్షిపణులు, బాంబులతో విరుచుకుపడింది. ముఖ్యంగా రాజధాని టెహ్రాన్‌లోని మౌలిక వ్యవస్థలపై భారీ స్థాయిలో మరిన్ని దాడులు చేస్తామని ప్రకటించింది. అటు లెబనాన్‌లోని హెజ్బొల్లా లక్ష్యాలపై కూడా దాడులను కొనసాగించింది. ఆ దేశంలో మృతుల సంఖ్య దాదాపు 1,100కు చేరింది. లెబనాన్‌లో తీర ప్రాంత నగరమైన నఖోరాలో తమ ప్రధాన కార్యాలయంపై క్షిపణి దాడి జరిగినట్టు ఐరాస శాంతి పరిరక్షణ దళం (యునిఫిల్) పేర్కొంది. ఇరాన్ కూడా తీవ్ర స్థాయిలో ప్రతి దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపించింది. పలు డ్రోన్లను అడ్డుకుని కూల్చేసినట్టు యూఏఈ పేర్కొంది.

# ప్రజలకు నష్టం చేయం

ఆ సమస్యల నుంచి స్థానికులకు విముక్తి కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. మూసీలో శుభ్రమైన నీరు ప్రవహించేలా గోదావరి జలాలు తెస్తున్నాం..'అని ముఖ్యమంత్రి చెప్పారు.

మూసీ బఫర్ జోన్ 50 మీటర్లు

'గాంధీసరోవర్ నిర్మించేందుకు 98 ఎకరాల రక్షణ శాఖ భూమిని కేంద్రం ఇస్తుంది. టూరిజం శాఖ దగ్గర ఇంకో 100 ఎకరాలు ఉన్నాయి. ఆ అపార్ట్‌మెంట్‌ల (మధుపార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్‌ల అంశాన్ని ఉద్దేశించి) భూమి తీసుకోకపోయినా పరవాలేదు. కానీ ఆ అపార్ట్‌మెంట్‌లలో ఉండే మిత్రులు 2005-06లో 9 మీటర్ల బఫర్ జోన్ చూపించి అనుమతులు తీసుకున్నారు. అయితే 2016లో మూసీ బఫర్ జోన్ 50 మీటర్లు అయ్యింది. ఆ ప్రకారం మార్క్ చేస్తే సగం అపార్ట్‌మెంట్‌లు బఫర్ జోన్‌లో ఉంటాయి. భవిష్యత్తులో వాటిని అమ్ముకోవడానికి వీలుకాదు. అందువల్ల నష్టం జరుగుతుందని మాత్రమే చెబుతున్నాం. మీకు ఇష్టమైతే, ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం ఆ భూమిని ఇప్పుడు ఇస్తే నష్టపరిహారం ఇస్తాం. ప్రత్యామ్నాయం చూపడానికి కూడా అభ్యంతరం లేదు.

హైదరాబాద్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్

ఎంతో ఘన చరిత్ర ఉన్న హైదరాబాద్‌లో మానవ తప్పిదాలతో సమస్యలు వస్తున్నాయి. నగరంలో వాహనాల సంఖ్య పెరిగింది. అందుకు తగ్గట్టుగా పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. సికింద్రాబాద్, చర్లపల్లి రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేశాం. తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అని మూడు జోన్లుగా విభజించాం. క్యూర్ పరిధిని సేవా రంగంగా, ప్యూర్‌ను తయారీ కేంద్రంగా, రేర్‌ను వ్యవసాయ ప్రాధాన్యతగా అభివృద్ధి చేయబోతున్నాం. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతం (క్యూర్)లోని కాలుష్య కారక పరిశ్రమలను బయటకు తరలిస్తేం నగరం నివాస యోగ్యంగా మారుతుంది. అందుకే హిల్ట్ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్‌ను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేసే క్రమంలో ఒకే విధమైన పరిపాలన విధానం కోసం మూడు మున్సిపల్ కార్పొరేషన్లు, నాలుగు పోలీసు కమిషనరేట్లు ఏర్పాటు చేశాం. భవిష్యత్ అభివృద్ధి కోసం ఒక రోడ్‌మ్యాప్‌ను తయారు చేశాం..'అని సీఎం తెలిపారు.

మెట్రో విస్తరణ..ఎలివేటెడ్ కారిడార్లు

'ప్రజల సౌకర్యం కోసం ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి జైపాల్‌రెడ్డి ఉన్న సమయంలోనే హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు సదుపాయం వచ్చింది. ఆనాడు దేశంలో రెండో స్థానంలో ఉన్న మన మెట్రో గత పదేళ్లలో నిర్లక్ష్యంతో తొమ్మిదో స్థానానికి పడిపోయింది. మెట్రో విస్తరణకు ఎల్అండ్‌టీ అనుకూలంగా లేకపోవడంతో మెట్రోను రూ.15 వేల కోట్లు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం స్వాదీనం చేసుకుంటోంది. ఏప్రిల్ వరకు ఈ ప్రక్రియ ముగుస్తుంది. ఆ తర్వాత లాస్ట్‌మైల్ కనెక్టివిటీ వచ్చేలా మెట్రో రైలును నాగోల్ నుంచి ఎయిర్‌పోర్టుకు, గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట, రాయిదుర్గం నుంచి నియోపోలీస్ వరకు మొత్తం 76 కిలోమీటర్లు మార్గాన్ని రూ.24 వేల కోట్లతో నిర్మించేందుకు అన్ని ప్రణాళికలు పూర్తయ్యాయి. మెట్రో విస్తరణకు కేంద్రం కూడా సానుకూలంగా ఉంది.

హిమాయత్‌సాగర్ నుంచి గౌరెల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్

ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్‌కు రేడియల్ రోడ్లు వేస్తున్నాం. హిమాయత్‌సాగర్ నుంచి రామోజీ ఫిల్మ్‌సిటీ దగ్గర ఉన్న గౌరెల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్ వేస్తున్నాం. గండిపేట నుంచి గౌరెల్లికి 40 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే చేరుకుంటారు. నగరంలో ఉండే వాళ్లు నగరం బయటకు వెళ్లేందుకు వీలుగా నగరం మధ్యలోంచి మూసీ వెంట ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తాం. దీనికి గౌలిగూడ బ్రిడ్జి దగ్గర, చాదర్‌ఘాట్ దగ్గర, నాగోల్ దగ్గర, అంబర్‌పేట జంక్షన్ దగ్గర ట్రంపెట్లు వస్తాయి. ఇలా హైదరాబాద్‌ను అద్భుత రీతిలో అభివృద్ధి చేసే ప్రణాళికలతో ముందుకు వెళుతున్నాం..'అని రేవంత్ వివరించారు.

బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద రోడ్డు

'హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు.. రోడ్లను అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్ అని మూడు రకాలుగా అభివృద్ధి చేస్తున్నాం. బేగంపేట్ ఎయిర్‌పోర్టు మధ్యలో రన్‌వే కింది నుంచి అండర్‌పాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతి తెచ్చాం. పనులు జరుగుతున్నాయి. దేశంలో ఇలాంటి రోడ్డు ఎక్కడా లేదు. నల్లగొండ, విజయవాడ రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్లను జూలై వరకు పూర్తిచేస్తాం. ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించి ప్రజల ప్రాణాలు కాపాడాలనుకుంటున్నాం. ఫుట్‌పాత్ వ్యాపారులకు ఎక్కడైనా స్థలాన్ని కేటాయించి ప్రోత్సహిస్తాం. మల్టీలెవల్ పార్కింగ్ విధానాన్ని

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన తెలంగాణ క్యాబినెట్ పలు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. విద్వేషపూరిత ప్రసంగాలు.. నేరాల నిరోధక బిల్లు, తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ వర్కర్ల బిల్లు, తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లులకు ఆమోదం తెలిపింది. ఎల్అండ్‌టీ నుంచి మెట్రో స్వాధీన ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం తరఫున లావాదేవీల నిర్వహణ బాధ్యతను హెచ్ఎంఆర్ఎల్‌కు అప్పగించింది.

గిగ్ వర్కర్ల బిల్లుకు తెలంగాణ క్యాబినెట్ ఆమోదం

కులగణనపై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కమిటీ ఇచ్చిన నివేదికకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. నిపుణుల కమిటీ నివేదికను పరిశీలించే బాధ్యత క్యాబినెట్ సబ్‌కమిటీకి అప్పగించింది. రోహిత్ వేముల చట్టం విధివిధానాల కోసం సబ్ కమిటీ ఏర్పాటు చేస్తూ తీర్మానించింది. ఈ కమిటీ ఛైర్మన్‌గా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కమిటీ సభ్యులుగా మంత్రులు దామోదర రాజనరసింహ, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్, పొన్నం ప్రభాకర్ వ్యవహరించనున్నారు. తల్లిదండ్రుల మద్దతు బిల్లును మంత్రివర్గం ఆమోదించింది. తల్లిదండ్రులను ఆదరించని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల్లో కోత విధించేలా ఈ బిల్లును రూపొందించారు. వేతనాల్లో 10శాతం లేదా రూ.10వేలు తల్లిదండ్రులకు ఇచ్చేలా బిల్లుకు రూపకల్పన చేశారు.అందుబాటులోకి తెస్తున్నాం..'అని సీఎం తెలిపారు.



## రైతు రుణమాఫీ మా పరిశీలనలో లేదు

**ఈ కబురు ,ఢిల్లీ: రైతు రుణాలను మాఫీ చేసే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు ఆమె సోమవారం ఈ మేరకు రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. అన్నదాతల ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేసేందుకు సర్కారు అనేక చర్యలు తీసుకుందన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) ద్వారా వారికి రాయితీ వడ్డీరేట్లపై రూ.3 లక్షల వరకూ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే.. సవరించిన వడ్డీ రాయితీ పథకం (ఎంఐఎస్ఎస్) కింద అదనపు ప్రోత్సాహకాలూ ఇస్తున్నామని చెప్పారు. రిజర్వు బ్యాంకు జారీ చేసిన ప్రాధాన్యరంగ రుణాల మార్గదర్శకాల ప్రకారం అనుబంధ కార్యకలాపాల రుణాలతో సహా పూచీకత్తు లేని స్వల్పకాలిక వ్యవసాయ రుణాలను రూ.1.60 లక్షల నుంచి రూ.2.00 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. వ్యవసాయం సహా ఆర్థిక వ్యవస్థలోని ప్రాధాన్య రంగాలకు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి తగినంత రుణ ప్రవాహం ఉండేలా చూస్తున్నామని పేర్కొన్నారు. పీఎం-కిసాన్ పథకం కింద రైతులకు నేరుగా నగదు బదిలీతో పాటు పంటల బీమా అందిస్తున్నామని వెల్లడించారు. ముగిసింది.**

# ఫార్ములా ఈకార్ రేసు కేసులో ఏ1గా కేటీఆర్

ఫార్ములా ఈఆపరేషన్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్న ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థకు బాధ్యతలు అప్పగించడం, దానికి ప్రతిఫలంగా ఆ సంస్థ నుంచి భారాసకు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.45 కోట్లు రావడం... క్విడ్ ప్రోకోలో భాగమేనని పొందుపరచినట్లు తెలుస్తోంది.

కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గతేడాది నవంబరులో అప్పటి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అనుమతిచ్చిన విషయం తెలిసిందే. కాగా... ఫార్ములా ఈకార్ రేసుకు సంబంధించి 2024 డిసెంబరు 18న ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీని ఆధారంగా ఈడీ సైతం మరో కేసు నమోదు చేసింది. ఈ మేరకు అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్‌రెడ్డి, కేటీఆర్‌లను ఏసీబీ, ఈడీ అధికారులు విచారించారు. ఛార్జిషీట్‌లో కేటీఆర్ తదితరులు నిధుల దుర్వినియోగానికి, మోసానికి పాల్పడ్డారని, నేరపూరిత కుట్రలో భాగస్వామి అయ్యారని, ఇతరులకు లాభం కలిగించేలా ప్రవర్తించారని ఏసీబీ అధికారులు పేర్కొన్నట్లు సమాచారం.

ఇదీ కేసు నేపథ్యం...

భారాస ప్రభుత్వ హయాంలో 2023 ఫిబ్రవరిలో హుస్సేన్‌సాగర్ వద్ద ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహించారు. దీని నిర్వహణకు బ్రిటన్‌కు చెందిన ఎఫ్ఈవో (ఫార్ములా ఈ ఆపరేషన్స్), హైదరాబాద్‌కు చెందిన గ్రీన్‌కో అనుబంధ కంపెనీ ఏస్ నెక్స్ట్‌జెన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(ఎంఏయూడీ)ల మధ్య 2022 అక్టోబరు 25న త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఈ మేరకు హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో సీజన్ 9, 10, 11, 12 రేసుల నిర్వహణ కోసం ట్రాక్ నిర్మాణం సహా ఇతర మౌలిక సదుపాయాలను ఎంఏయూడీ కల్పించాలి. 2023 ఫిబ్రవరి 11న సీజన్ 9 నిర్వహించారు. వివిధ కారణాలతో ఏస్ నెక్స్ట్‌జెన్, ఎఫ్ఈవో సంస్థల మధ్య విభేదాలు తలెత్తాయి. తమకు డబ్బులు చెల్లించకపోవడంతో కార్ రేస్ నిలిపివేస్తున్నట్లు ఎఫ్ఈవో సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది. దీంతో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలతో అర్వింద్‌కుమార్ నేతృత్వంలో ఎఫ్ఈవో, ఎంఏయూడీల మధ్య 2023 అక్టోబరులో మరో కొత్త ఒప్పందం జరిగింది. ఈకార్ రేసు నిర్వహణకు స్పాన్సర్ ఫీజు, పన్నులు కలిపి మొత్తం రూ.110 కోట్లు చెల్లించాలని అగ్రిమెంట్‌లో పేర్కొన్నారు.

మున్సిపల్ సేవలు, సివిల్ వర్క్స్ కోసం మరో రూ.50 కోట్లు ఖర్చు చేసేలా అండర్ టేకింగ్ తీసుకున్నారు. ఇలా హెచ్ఎండీఏ బోర్డుకు సంబంధించిన నిధుల నుంచి రూ.160 కోట్లు మంజూరు చేసేలా ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో సీజన్ 10 నిర్వహణ కోసం 2023 అక్టోబరు 3, 11 తేదీల్లో హెచ్ఎండీఏ బోర్డు సాధారణ నిధుల నుంచి ఎఫ్ఈవోకు రూ.45,71,60,625 విదేశీ కరెన్సీ రూపంలో బదిలీ చేశారు. ఇది ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందంటూ ఐటీ శాఖ హెచ్ఎండీఏకు రూ.8.07 కోట్ల జరిమానా విధించింది. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏసీబీ కేసు నమోదు చేసింది. ప్రాథమిక విచారణ తర్వాత హెచ్ఎండీఏ బోర్డు... ఖజానా నుంచి మొత్తంగా రూ.54,88,87,043 దుర్వినియోగమైనట్లు తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. మొత్తం పది మందిపై కేసులు నమోదయ్యాయి. దర్యాప్తులో భాగంగా ఏసీబీ అధికారులు కేటీఆర్, అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్‌రెడ్డిలను రెండుసార్లు ప్రశ్నించారు. ఫార్ములాఈ ఆపరేషన్స్ ప్రతినిధులను సైతం ఆన్‌లైన్‌లో విచారించారు. ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. రేసు నిర్వహణ సంస్థ విదేశాల్లో ఉండటం, ఆ సంస్థ ప్రతినిధులను విచారించకుండా కేసు దర్యాప్తు ముగించడం సాధ్యం కాదు. ఏసీబీకి విచారించే అధికారం లేకపోవడంతో ఆన్‌లైన్‌లో విచారించి ఆ వివరాలను ఛార్జిషీట్‌లో పేర్కొంది. దీంతోపాటు అర్వింద్‌కుమార్ ఐఏఎస్ అధికారి కావడంతో ప్రాసిక్యూట్ చేయడానికి డీవోపీటీ అనుమతి కోసం చాలాకాలం వేచి చూడాల్సి వచ్చింది. ఇక ప్రజాప్రతినిధిగా ఉన్న కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి కోసం మరికొంత కాలం వేచి చూడాల్సి వచ్చింది. మొత్తానికి అనేక మలుపుల తర్వాత ఛార్జిషీట్ దాఖలు చేయడంతో దర్యాప్తు

# విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

ఈ కబురు , హైదరాబాద్: విద్యుత్ సంస్థలో పని చేస్తూ విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగులు ఒర్సు సురేశ్, ముక్తార్ బేగ్ కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అజారుద్దీన్, వివేక్, ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ తదితరులతో కలిసి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి పది లక్షలకు పెంచామన్నారు. విద్యుత్, సింగరేణి కార్మికులకు రూ.కోటి పైన ప్రమాద బీమా సౌకర్యం కల్పించామని తెలిపారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపేందుకే అసెంబ్లీ సమావేశాల సమయంలో చెక్కుల పంపిణీ చేపట్టామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే(సీపెక్)లో గుర్తించిన కుటుంబాలన్నింటికీ రూ.5 లక్షల జీవిత బీమా వర్తింపజేస్తామని తెలిపారు. కుటుంబ యజమాని మరణించినప్పుడు బాధిత కుటుంబ సభ్యులు వీధిన పడొద్దన్న భావనతోనే ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రారంభిస్తున్నామన్నారు.

**రూ.1.2 కోట్ల బీమా చరిత్రాత్మకం: భట్టి**

భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.2 కోట్ల ప్రమాద బీమా కల్పించడం చరిత్రాత్మకమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ఇలాంటి పథకం దేశంలో మరెక్కడా లేదని చెప్పారు. ఈ పథకం ద్వారా విద్యుత్ సంస్థల్లోని 51 వేల మంది, సింగరేణి సంస్థలో 41 వేల మంది, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు 7.57 లక్షల మంది కుటుంబాలకు భరోసా లభిస్తుందని వివరించారు. అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ 2025 అక్టోబరులో మరణించిన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం దత్తప్పగూడేనికి చెందిన ఒర్సు సురేశ్, మహబూబ్‌నగర్ సర్కిల్ సివిల్ విభాగంలో ఆర్టిజన్‌గా పనిచేస్తూ 2025 ఏప్రిల్‌లో మరణించిన ముక్తార్ బేగ్ కుటుంబాలకు రూ.కోటి చొప్పున చెక్కులను అందజేసి ప్రభుత్వం అండగా నిలిచిందని భట్టి తెలిపారు. ప్రపంచంలోని ఏ అభివృద్ధి చెందిన దేశానికీ సాధ్యం కాని రీతిలో రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు జీవిత బీమా పథకాన్ని ఈ బడ్జెట్‌లో ప్రవేశపెట్టామన్నారు.

# శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకుల డిష్యుం డిష్యుం

- ఎమ్మెల్యే మాధవరం ముందే బాహాబాహికి దిగిన యువ నాయకులు
- నాయకుల గలాటాతో వాడి వేడిగా సమీక్షా సమావేశం



**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

నాయకుడు లేని నావగా మారిన శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు రచ్చకెక్కాయి. ఇద్దరు యువ నాయకుల పిడుగులతో చేసిన గలాటా సోమవారం జరిగిన సమీక్షా సమావేశాన్ని వాడి వేడిగా మార్చింది. ఏకంగా కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముందే ఇద్దరు యువ నాయకులు బాహాబాహికి దిగడం సంచలనంగా మారింది శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని ఒకే డివిజన్ కు చెందిన ఒకే సామాజిక వర్గం యువ నాయకులు ఒకరిపై ఒకరు చేయి చేసుకునేంతవరకు వెళ్లడం చర్చనీయాంశమైంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివిధ డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ సమీక్ష సమావేశాన్ని సోమవారం కూకట్పల్లిలోని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నివాసంలో నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్ల ఆశావహులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభానికి ముందే ఇద్దరు నాయకులు మధ్య మాటా మాటా పెరిగి వివాదానికి దారి తీసినట్లు తెలుస్తుంది. శేరిలింగంపల్లి పూర్వ ఉమ్మడి డివిజన్ నుంచి టికెట్ ఆశిస్తున్న ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు యువ నాయకులు ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో దాడులు చేసుకున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు యువ నాయకుల్లో ఒకరు గత కొన్నేళ్లుగా బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తుండగా.. మరో యువ నాయకుడు కొన్ని నెలల క్రితమే పార్టీలో చేరాడు. ఇద్దరు నాయకులు ఒకే డివిజన్ నుంచి టికెట్ ఆశావహులుగా ఉండడంతో గత కొద్ది రోజులుగా ఇద్దరి మధ్య వివాదం కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎదురుపడిన ఇద్దరు నాయకులు వాగ్వాదానికి దిగారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకుని రచ్చకెక్కినట్లు తెలుస్తుంది. అక్కడే ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే మాధవరం, శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు వీరి గలాటాతో పిస్తుపోయారు. చివరికి సీనియర్ నాయకుల జోక్యంతో ఇద్దరు శాంతించినట్లుగా తెలుస్తుంది. ఈ వివాదం బయటకు పొక్కకుండా సీనియర్ నాయకులు జాగ్రత్త పడినా, కూకట్పల్లి నియోజకవర్గంలో హాట్ టాపిక్ గా మారినట్లు తెలుస్తుంది.

### పెద్ద దిక్కులేని గులాబీ దళం...

గత అసెంబ్లీ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో జండా ఎగరవేసిన గులాబీ పార్టీకి నేడు నియోజకవర్గంలో పెద్దదిక్కు లేకుండా పోవడం క్యాడర్ ను నిస్తేజానికి గురిచేస్తుంది. సరిగ్గా రెండేళ్లకు ముందు శేరిలింగంపల్లిలో దాదాపు అన్ని ప్రజాప్రతినిధుల స్థానాలు గులాబీ దండుతోనే ఉండగా, నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీకి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సైతం నాయకులు ఒక్కొక్కరు దూరమయ్యారు. కాగా నాయకులు మారినా క్యాడర్ మాత్రం గులాబీ పార్టీని వీడ లేదు. నేటికీ పటిష్టమైన క్యాడర్ ఉన్నా... వారిని ముందుండి నడిపించే నాయకుడు కరువయ్యాడు. ప్రస్తుత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో పలువురు కొత్తగా పార్టీలో చేరారు. గతంలో ఉన్న వారితో పాటు నూతనంగా పార్టీలో చేరిన వారు సైతం పలు డివిజన్ల ఆశావహుల రేసులో కి రావడంతో బీఆర్ఎస్ పార్టీలో లుకలుకలు ప్రారంభమయ్యాయి. అధిష్టానం వీటిని పట్టించుకోకపోవడంతో ఏకంగా ఎమ్మెల్యే ముందే బాహబాహికి దిగేంతవరకు విషయం వెళ్లిందని బీఆర్ఎస్ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.



## ఈ రబీలోనూ ప్రతి గింజ కొంటాం



ఫిలిప్పీన్స్‌తెలంగాణ ప్రభుత్వాల మధ్య ఎంఓయూ జరిగిందని, ఈ విషయంలో మధ్యవర్తి ఎవరూ లేరని పేర్కొన్నారు. కాకినాడ పోర్ట్‌లో 6,700 టన్నుల బియ్యం నిల్వ ఉన్న మాట వాస్తవమేనని, కాకపోతే వాటికి బీమా, గోదాముల అద్దె తదితరాలన్నీ ఆ దేశ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. మీరు సిఫార్సు చేసిన వారికి టెండర్ ఇవ్వలేదని కుంభకోణమంటే ఎలా? మీరు అధికారులకు ఫోన్ చేయలేదా? పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి ఓ వ్యక్తిని పంపలేదా? అని హరీశ్‌ను మంత్రి ప్రశ్నించారు. దీన్ని నిరూపించాలని హరీశ్‌రావు వ్యాఖ్యానించగా.. దేశం నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేసిన రాష్ట్రం తెలంగాణ అని, అది చిరస్థాయిగా నిలిచిపోయే విజయమని చెప్పారు. ఈ ఖరీఫ్‌లో 71.86 లక్షల టన్నుల వడ్లు కొన్నామని, అది ఓ రికార్డన్నారు. రాష్ట్రంలో ఈ రబీ సీజన్‌లో పండిన ప్రతి వడ్ల గింజను కొంటామన్నారు. వరి ధాన్యానికి బోనస్ ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. పలువురు సభ్యులు భూసేకరణ చేయకపోవడం, పరిహారం ఇవ్వకపోవడం వల్ల అనేక చిన్న సాగునీటి పథకాలు, ప్రాజెక్టులు ఆగిపోయాయని చెప్పారని, అందుకు ప్రస్తుతం పనులు జరుగుతున్న ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, పరిహారం(ఆర్‌ఆర్) కోసం జూన్‌లోపు అందుకు రూ.5 వేల కోట్లు చెల్లిస్తామన్నారు.

**కేసులున్న వ్యక్తి సలహాదారా?: హరీశ్‌రావు**

అంతకుముందు భారాస సభ్యుడు హరీశ్‌రావు మాట్లాడుతూ ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులకు సంబంధించి ప్రేమ్‌చంద్ గార్గ్‌ను అడ్వయిజర్‌గా పెట్టుకున్నారని, ఆయనపై సీబీఐ, ఈడీ తదితర కేసులున్నాయని, బియ్యం ఎగుమతులు ఓ కుంభకోణమని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ ముందుకు వచ్చినా ఎందుకు ప్రైవేట్ సంస్థకు పని అప్పగించారని ప్రశ్నించారు. కాకినాడ పోర్ట్‌లో 7,500 టన్నుల బియ్యం ఏడాదిగా ఉన్నాయని, అవి ముక్కిపోవా అని ప్రశ్నించారు. దానిపై హౌస్ కమిటీని నియమిస్తే అన్ని ఆరోపణలను రుజువు చేస్తామన్నారు. తమ నియోజకవర్గాల్లోని సాగునీటి ప్రాజెక్టులపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేముల వీరేశం, నారాయణరెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు.

## ఉద్యోగుల డీఏ, పీఆర్‌సీలపై.. భట్టి X హరీశ్

చేతల్లో కనిపించడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. గత ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించకుండా తమపై రూ.40,154 కోట్ల భారం మోపి వెళ్లిపోయిందని భట్టి చెప్పగా.. మీ ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్ల తర్వాత కూడా ఇంకా గత సర్కారును ఎందుకు నిందిస్తారంటూ హరీశ్‌రావు విమర్శించారు. ఇలా దాదాపు అరగంటకు పైగా ఇద్దరి మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగాయి.

**5 డీఏల పెండింగ్ దేశంలో ఎక్కడా లేదు: హరీశ్‌రావు**

'ఐదు డీఏలు ఎప్పుడు మంజూరు చేస్తారు? రెండో పీఆర్‌సీ ఎప్పటినుంచి అమలు చేస్తారని ప్రశ్నిస్తే దాటవేసే ధోరణిలో సమాధానం చెబుతారా? 5 డీఏల పెండింగ్ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదు' అని హరీశ్‌రావు విమర్శించారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక ఇచ్చే గడువు ఈనెల 31వ తేదీ వరకు ఉందని, దాన్ని మళ్లీ పొడిగిస్తారా? అని ప్రశ్నించారు. ఫుట్‌బాల్ పోటీలు, సీఎం క్యాంపు ఆఫీస్ నిర్మాణం, మూసీనది సుందరీకరణకు నిధులున్నాయిగానీ.. విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ బిల్లులు చెల్లించడానికి లేవా అని ప్రశ్నించారు. మాటల్లోనే తప్ప చేతల్లో మానవీయ కోణం కనిపించడం లేదన్నారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఇప్పుడు కిమ్మనడం లేదని, దేనికీ సరైన సమాధానం రానందున భారాస వాకౌట్ చేస్తున్నట్లు హరీశ్‌రావు ప్రకటించి తమ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి బయటకు వెళ్లిపోయారు. ఉద్యోగుల సమస్యలపై భారాస ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, సంజయ్ కూడా మాట్లాడారు.

**ఉద్యోగులకు బిల్లులు చెల్లించలేక పదవీ విరమణ వయసు పెంచి వెళ్లారు: భట్టి విక్రమార్క**

ఉద్యోగుల సమస్యలపై తమ మంత్రివర్గంలోని అందరికీ మానవీయ కోణం ఉందని.. గత ప్రభుత్వం సక్రమంగా చేసి ఉంటే.. ఇప్పుడు ఈ సమస్య ఉత్పన్నమయ్యేది కాదని ఉప ముఖ్యమంత్రి భట్టి వ్యాఖ్యానించారు. మీరు మూడు డీఏలు పెండింగ్ పెట్టి వెళ్లారని, వాటిని కూడా సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేస్తామని తెలిపారు. భారాస ప్రభుత్వం ఉద్యోగులకు పదవీ విరమణ ఆర్థిక ప్రయోజనాలు చెల్లించలేక పదవీ విరమణ వయసును 58 నుంచి 61కి పెంచిందని విమర్శించారు. దానివల్ల 2024 మార్చి తర్వాత ఒకేసారి 17,000 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారని, ఫలితంగా గ్రాట్యుటీ, జీపీఎఫ్, సరెండర్ లీవ్స్ తదితరాల పేర భారీగా ఆర్థికభారం మోయాల్సి వచ్చిందని చెప్పారు. మొత్తం రూ.40,154 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించకుండా గత ప్రభుత్వం దిగిపోయిందని, అందులో రూ.4,574 కోట్లు ఉద్యోగుల బిల్లులేనని చెప్పారు. ఇప్పటివరకు ఉద్యోగులకు రూ.6,146 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించామన్నారు. ప్రస్తుతం ప్రతి నెలా రూ.700 కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల చేస్తున్నామని, దాన్ని రూ.వెయ్యి కోట్లకు పెంచాలనే విధానపర నిర్ణయంపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మెడికల్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామని, ఉద్యోగుల కోసం ఈహెచ్ఎస్ పదేళ్లుగా ఉన్న డిమాండని, దాన్ని నెరవేర్చామని పేర్కొన్నారు. భారాస ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేసి.. ఉద్యోగుల ఆర్థిక ప్రణాళికలను ఛిన్నాభిన్నం చేసిందని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితిని సరిదిద్దుతున్నామని పేర్కొన్నారు. పదవీ విరమణ చేసిన వారి మెడికల్ బిల్లులు ఒక్క రూపాయి కూడా పెండింగ్ ఉండరాదని ఆదేశించామన్నారు. ఇప్పుడు మీరు మొసలికన్నీరు కార్చినా ఎవరూ నమ్మరని విమర్శించారు. ఉద్యోగులు, ప్రజల సమస్యలపై తమ ప్రభుత్వ మానవీయ కోణాన్ని, చిత్తశుద్ధిని ఎవరూ ప్రశ్నించలేరని స్పష్టం చేశారు. పీఆర్‌సీ నివేదిక ఇచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని, గతంలో ఉద్యోగ సంఘాలతో గత ప్రభుత్వం చర్చలు జరపలేదని, ఇప్పుడు వారు ఎప్పుడైనా.. ఎవరినైనా కలిసే.. వారి అభిప్రాయాన్ని చెప్పే స్వేచ్ఛ ఇచ్చామన్నారు.

## ఏడాది కాలంగా రోహిత్‌రెడ్డికి డ్రగ్స్

ఇతని సహాయకుడు రాజేంద్రనగర్‌లోని భవానీనగర్‌కు చెందిన ఇంటీరియర్ డిజైనర్ అభిషేక్‌సింగ్‌తోపాటు రాజస్థాన్‌కు చెందిన అతడి స్నేహితుడి పాత్రను సిట్ గుర్తించింది. రాకేశ్‌వర్మ, రోహిత్‌రెడ్డి, బెంగళూరుకు చెందిన న్యాయవాది కౌశిక్‌రవిల మధ్య ఏడాదికాలంగా డ్రగ్స్ కొనుగోలు, ఇతర లావాదేవీలు ఉన్నట్లు బహిర్గతమైంది.

రోహిత్‌రెడ్డి, కౌశిక్‌రవి... డ్రగ్స్ కోసం రాకేశ్‌వర్మను సంప్రదిస్తుంటారని, అతడు అభిషేక్‌సింగ్ లేదంటే మరొకరి ద్వారా పంపిస్తున్నట్లు సమాచారం. ఈ ముగ్గురూ ఈ నెల 15వ తేదీ నుంచే పరారైనట్లు తెలుస్తోంది. నాలుగో వ్యక్తి గతంలో గోవాలో జరిగిన పార్టీలో డ్రగ్స్ తీసుకున్నట్లు, అతడికీ రోహిత్‌రెడ్డికి సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో బయటపడింది. ఫ్యూచర్‌సిటీ కమిషనర్ సుధీర్‌బాబు నేతృత్వంలోని సిట్... గతంలో జరిగిన డ్రగ్స్ పార్టీల గురించి ఆరా తీస్తుందనే భయంతోనే ఈ నలుగురూ పరారైనట్లు సమాచారం. ఇప్పటికే నిందితుల పేర్లు, చిరునామాలు సహా గుర్తించిన పోలీసులు... వారి కోసం వేర్వేరు బృందాలతో గాలిస్తున్నారు. రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్‌రెడ్డి, దిల్లీ వ్యాపారి నమిత్ శర్మ, ఏపీలోని ఏలూరు తెదేపా ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ సహా 11 మంది నిందితులుగా ఉన్న కేసులో కొత్తగా నలుగురి పేర్లు వెలుగులోకి రావడంతో కేసు మరిన్ని మలుపులు తీసుకునే అవకాశముంది. ఎంపీ పుట్టా మహేశ్ మినహా మిగిలిన ఏడుగురిని పోలీసులు గత సోమవారం నుంచి ఆదివారం వరకు విచారించగా... ఈ కొత్త పేర్లు

ఈ కేసులో కీలకంగా మారి.. ప్రస్తుతం పరారీలో ఉన్న డ్రగ్స్ పెడ్లర్ అభిషేక్‌సింగ్ ఈ నెల 16 నుంచి కనిపించడం లేదంటూ అతడి తండ్రి రాజేంద్రనగర్ ఠాణాలో ఫిర్యాదు ఇవ్వడం సంచలనంగా మారింది. అదే రోజున పోలీసుల విచారణకు హాజరైన రోహిత్‌రెడ్డి డ్రైవరు, వ్యక్తిగత సహాయకుడు సిలివేరు శరత్... అభిషేక్‌సింగ్ గురించిన సమాచారం ఇచ్చాడు. రోహిత్‌రెడ్డి ఆదేశాలతోనే ఓఆర్‌ఆర్ దగ్గర అభిషేక్‌ను కలిసి డ్రగ్స్ తీసుకున్నట్లు వాంగ్మూలం ఇచ్చారు. దీన్ని బట్టి డ్రగ్స్ పార్టీ వెలుగులోకి రావడంతోనే అభిషేక్ పరారైనట్లు, అతడికి రోహిత్‌రెడ్డితో కచ్చితంగా లింకు ఉందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అభిషేక్ తండ్రి ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. ''నా కుమారుడు అభిషేక్‌సింగ్(24) ఇంటీరియర్ డిజైనింగ్ చేస్తుంటాడు. నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ మెడిటేషన్ చేస్తున్నాడు. వృత్తిలో భాగంగా వివిధ ప్రాంతాలకు వెళ్తుంటాడు. ఒకవేళ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసినా ఇంటికి మాత్రం తిరిగొస్తాడు. ఈ నెల 16న రాత్రి 10 గంటలకు ఇంట్లోనే ఉన్న అభిషేక్... 17వ తేదీ ఉదయం నుంచి కనిపించలేదు. తొలుత స్నేహితులతో వెళ్లాడని భావించినా ఆ రోజు రాత్రికీ తిరిగి రాలేదు. కాల్ చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. సమీప బంధువులు, స్నేహితుల దగ్గర ఆరా తీసినా ఆచూకీ చిక్కలేదు'' అంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. బయటపడ్డాయిఅభిప్రాయాన్ని చెప్పే స్వేచ్ఛ ఇచ్చామన్నారు.

**మూడు రోజుల కస్టడీకి అనుమతి**

ఈ కేసులో ప్రధాన నిందితులు పైలట్ రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్‌రెడ్డి, దిల్లీకి చెందిన వ్యాపారి నమిత్‌శర్మల మూడు రోజుల పోలీసు కస్టడీకి ఉప్పర్‌పల్లిలోని కోర్టు అనుమతించింది. సోమవారం సాయంత్రం 4.30 గంటల నుంచి గురువారం సాయంత్రం 4.30 వరకు కస్టడీకి తీసుకోవాలని ఆదేశించింది. ప్రతిరోజూ ఉదయం 6 తర్వాత మాత్రమే విచారించాలని, రాత్రి 7 గంటల తర్వాత విచారణ వద్దని షరతు విధించింది. రోహిత్‌రెడ్డి తరఫు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా విచారణకు రాలేదు. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న ముగ్గురినీ మంగళవారం ఉదయం కస్టడీకి తీసుకునే అవకాశముంది. ఇప్పటికే వారి ఫోన్లలోని డేటా, సాంకేతిక అంశాలు, ఏడుగురు నిందితులైన మొరవినేని రమేశ్, వరమాచినేని శ్రవణ్‌కుమార్, నల్లపనేని విజయకృష్ణ(49), కౌశిక్ రవి(30), తిరువీధుల అర్జున్‌రెడ్డి(33), సిలివేరు శరత్‌కుమార్(33), ఆర్.ప్రియాంకరెడ్డి(34) ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా సమాచారం సేకరించిన పోలీసులు ఆయా అంశాలపైనే ముగ్గురినీ ప్రశ్నించనున్నారు. శిమ్లాలో కొకైన్ కొనుగోలు చేసినట్లు పోలీసులను తప్పుదోవ పట్టించిన కౌశిక్ రవి తీరును పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

## 'వనవాసి' మాట గిరిజన హక్కుల్ని కాలరాయడానికే

ఈ కబురు ,వడోదరా: గిరిజనుల్ని భాజపా, ఆరెస్సెస్‌లు 'వనవాసి' అని పిలవడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సోమవారం ఖండించారు. శతాబ్దాలుగా జలాలు, అడవులు, భూమిపై తొలి యాజమాన్యం గిరిజనులదేనని, ఆ హక్కును వారికి లేకుండా చేయడం కోసం భాజపా, ఆరెస్సెస్‌లు వారిని కేవలం అడవుల్లో నివసించే వనవాసులుగా అభివర్ణిస్తున్నాయని గుజరాత్‌లోని వడోదరాలో సోమవారం జరిగిన 'ఆదివాసి అధికార్ సంవిధాన్ సమ్మేళన్'లో ప్రసంగిస్తూ రాహుల్ పేర్కొన్నారు. దేశంలో కుల గణన జరిగితే అధికారం, సంపదలో గిరిజనులకు భాగస్వామ్యం లభిస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ''21వ శతాబ్దంలో ఆరెస్సెస్‌భాజపాలు సృష్టించిన ఒక కొత్త పదం ప్రాచుర్యం పొందుతోంది. అదే వనవాసి(అడవిలో నివసించేవారు). వనవాసి అంటే గిరిజనులు కేవలం అడవుల్లో నివసిస్తున్నారే తప్ప ఆదిమ కాలం నుంచీ అడవులకు యజమానులు కాదని అర్థం. ఆదివాసి అంటే అడవులు, భూములు, జలాలపై తొలి యాజమాన్య హక్కులు కలిగినవారని. ఈ రెండు మాటలకూ చాలా తేడా ఉంది'' అని రాహుల్ తెలిపారు. మరోవైపు.. భారత్‌అమెరికాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్రనేత విరుచుకుపడ్డారు. వాణిజ్య ఒప్పందం పేరుతో మోదీ.. భారత వ్యవసాయ రంగాన్ని అమెరికా సంస్థలకు బార్లా తెరిచేశారని దుయ్యబట్టారు.

## ఎంపీ రఘునందన్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గంగాధర్ రెడ్డి

**ప్రజాసేవలో అంకితభావంతో పనిచేస్తున్న రఘునందన్ రావు : గంగాధర్ రెడ్డి**




గచ్చిబౌలి డివిజన్ నాయకులతో కలిసి ఎంపీ ని కలిసిన గంగాధర్ రెడ్డి



ఈ-కబురు, శేరిలింగంపల్లి : మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు జన్మదినం సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన గచ్చిబౌలి డివిజన్ తాజా మాజీ గంగాధర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ నాయకులతో కలిసి కోకాపేట్ లోని మాధవనేని రఘునందన్ నివాసానికి తరలివెళ్లిన గంగాధర్ రెడ్డి ఎంపీని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ, రఘునందన్ రావు ప్రజా సేవలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించారని అన్నారు. ఆయనకు ఆయురారోగ్యాలతో పాటు మరిన్ని విజయాలు చేకూరాలని భగవంతుని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శేఖర్, అరుణ్ గౌడ్, సుమన్, రంగస్వామి, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వం చేతికి మెట్రోరైలు సంస్థ!



ఈ ప్రక్రియ పూర్తిచేసేందుకు మంత్రివర్గ ఉపసంఘానికి బాధ్యతలు అప్పగించింది. ఈనెల 31నాటికి పూర్తిస్థాయి స్వాధీనంపై చర్చించిన మంత్రివర్గం.. ముగింపు తేదీ ఖరారుపై ఉపసంఘం నిర్ణయం తీసుకుని, వచ్చే మంత్రివర్గ సమావేశానికి ప్రతిపాదనలు పంపాలంది. మెట్రోరైలు కొనుగోలుకు అవసరమైన రుణాన్ని ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్ఎఫ్‌సీ) సమకూర్చనుందని పేర్కొంది. ప్రభుత్వం బహిరంగ ప్రకటన చేసిన తేదీ(2025 సెప్టెంబరు 25)ని గాని, మంత్రివర్గం ఆమోదించిన తేదీ(2026 ఫిబ్రవరి 23)ని గాని మెట్రో స్వాధీన లావాదేవీ ప్రక్రియ ముగింపు తేదీగా గుర్తించాలని ఎల్‌అండ్‌టీ కోరింది. మంత్రివర్గం.. ఈ బాధ్యతను ఉపసంఘానికి అప్పగించింది.

మెట్రో ఫేజ్2ఏ కింద రూ.24,269 కోట్ల వ్యయంతో 76.4 కి.మీ., ఫేజ్2బీ కింద రూ.19,579 కోట్ల వ్యయంతో 86.1 కి.మీ.ల మార్గానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. తొలిదశ ప్రాజెక్టును మెట్రో సంస్థ నుంచి స్వాధీనం చేసుకోవడం ద్వారా విస్తరణ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మెట్రోరైలు విధానం మేరకు రెండోదశ అనుమతులు సాధించాలని భావించింది. ఈ మేరకు మంత్రివర్గం ఇప్పటికే స్వాధీన ప్రతిపాదనను ఆమోదించింది.

# గోపనపల్లిలో అక్రమ నీటి వ్యాపారం

**గ్రామంలో తీవ్ర తాగునీటి సంక్షోభం, ఎమ్మార్వోకు గ్రామస్థుల ఫిర్యాదు**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి మండలం పరిధిలోని గోపనపల్లి గ్రామంలో భూగర్భ జలాల అక్రమ వినియోగం, ట్యాంకర్ల ద్వారా నీటి తరలింపుల కారణంగా తీవ్ర తాగునీటి సంక్షోభం నెలకొంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఈ సమస్యపై గ్రామస్థులు పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పరిస్థితి మరింత విషమించిందని తెలిపారు. గ్రామ పరిధిలో పెద్దఎత్తున బోర్లు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి, అక్రమ నీటి వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ నీటి వ్యాపారులు పెద్ద ఎత్తున బోర్లు వేసి భారీ మోటార్లతో నీటిని తోడుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని వాపోయారు. గ్రామంలోని ఇళ్లల్లో ఉన్న బోర్లు చాలావరకు వట్టిపోయాయని, ప్రస్తుతం 1200 నుంచి 2000 ఫీట్లు బోర్లు వేసినా నీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. ఫలితంగా గ్రామ ప్రజలు రోజువారీ అవసరాలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు గ్రామస్థులు ట్యాంకర్లను అడ్డుకుని నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ తాత్కాలిక చర్యలకే పరిమితమైందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితిపై సోమవారం గోపనపల్లి గ్రామస్థులు శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేసి అక్రమ నీటి తరలింపును అరికట్టడంతో పాటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి విచారణ జరిపి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పల్లపు సురేందర్, రాజు నాయక్, మూలగిరి శ్రీనివాస్, శివకుమార్, వేణు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసిల్దార్ కు ఫిర్యాదు చేస్తున్న కూపనపల్లి వాసులు




# పీఎస్‌యూ బ్యాంకుల విలీన ప్రతిపాదన పరిశీలన లేదు

ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)ల విలీనం లేదా స్థిరీకరణ ప్రతిపాదనేదీ ప్రస్తుతం పరిశీలనలో లేదని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరీ స్పష్టం చేశారు. గతంలో కొన్ని పీఎస్‌బీల విలీనం వల్ల, బలమైన బ్యాంకుల ఏర్పాటుకు వీలైందని లోక్‌సభకు రాతపూర్వకంగా తెలిపారు. బ్యాంకుల విలీనం వల్ల నెట్‌వర్క్‌లను సమర్థంగా ఉపయోగించుకోవడం, తక్కువ వ్యయాల డిపాజిట్లకు వీలు కల్పించడం, భారీ స్థాయి రుణాలిచ్చే సామర్థ్యాన్ని పెంచడం, పోటీతత్వ కార్యకలాపాలకు వీలు కలిగిందన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌ల విలీనం 2019 ఏప్రిల్ 1న అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. 2019 మార్చిలో ఈ మూడు బ్యాంకుల వ్యాపారం రూ.16.1 లక్షల కోట్లుగా ఉండగా, 2025 మార్చి కల్లా రూ.27 లక్షల కోట్లకు పెరిగిందని వెల్లడించారు.

పీఎన్‌బీలో ఓబీసీ, యునైటెడ్ బ్యాంక్ విలీనం 2020 ఏప్రిల్ 1న అమల్లోకి వచ్చింది. అయిదేళ్లలో వీటి వ్యాపారం రూ.18.3 లక్షల కోట్ల నుంచి రూ.26.8 లక్షల కోట్లకు చేరిందన్నారు.

యూనియన్ బ్యాంక్‌లో ఆంధ్రా బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంక్‌ల విలీనం 2020 ఏప్రిల్ 1న అమల్లోకి రాగా, అయిదేళ్లలో వీటి వ్యాపారం రూ.15.3 లక్షల కోట్ల నుంచి రూ.22.9 లక్షల కోట్లకు చేరినట్లు తెలిపారు.

కెనరా బ్యాంక్‌లో సిండికేట్ బ్యాంక్‌ను 2020 ఏప్రిల్ 1న కలపగా, 2025 మార్చి నాటికి విలీన బ్యాంకు వ్యాపారం విలువ రూ.15.7 లక్షల కోట్ల నుంచి రూ.25.3 లక్షల కోట్లకు చేరిందన్నారు.

అలహాబాద్ బ్యాంక్‌లో ఇండియన్ బ్యాంక్ విలీనం కాగా, అయిదేళ్లలో వ్యాపారం రూ.8.6 లక్షలకోట్ల నుంచి రూ.13.3 లక్షల కోట్లకు చేరింది.

# మార్కెట్‌లో వార్ విధ్వంసం



ముంబై: ఒకపక్క 'ఇరాన్ వార్, మరోపక్క 'చమురు ధరల బాంబ్'తో దలాల్ స్ట్రీట్ మరోసారి దద్దరిల్లింది. డాలర్ మారకంలో రూపాయి విలువ రోజుకో కొత్త కనిష్టానికి నమోదుచేస్తోంది. దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. ఈ అంశాలూ మార్కెట్ వర్గాలను కలవరపెట్టాయి. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 1,837 పాయింట్లు(2.46%) క్షీణించి 72,696 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ 602 పాయింట్లు(2.60%) కుప్పకూలి 22,513 వద్ద నిలిచింది. బలహీన అంతర్జాతీయ సంకేతాలతో ఉదయమే సూచీలు భారీ నష్టాలతో మొదలయ్యాయి. అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో ట్రేడింగ్ సమయంలో అమ్మకాల సునామీ వాతావరణం నెలకొంది. ఒకానొక దశలో సెన్సెక్స్ 1,975 పాయింట్లు క్షీణించి 72,558 వద్ద, నిఫ్టీ 644 పాయింట్లు పతనమై 22,471వద్ద ఇంట్రాడే కనిష్టాలు నమోదు చేశాయి.

**ఇండెక్సులన్నీ నష్టాల్లోనే**

అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. బీఎస్ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో కన్జూమర్ డ్యూరబుల్స్ 5%, మెటల్ 4.76%, సరీస్‌సెస్ 4.70%, ప్రభుత్వ రంగ బ్యాంకులు 4.39%, కమోడిటీస్ 4.35%, ఇండ్రస్టియల్స్ 4.05%, క్యాపిటల్ గూడ్స్ 3.99 శాతం పతనమయ్యాయి. మిడ్, స్మాల్ క్యాప్‌లు వరుసగా 3.82%, 3.66 శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ సూచీలో 30 షేర్లలో హెచ్‌సీఎల్‌టెక్ 1.83%, పవర్‌గ్రిడ్ 1.39%, ఇన్ఫోసిస్ 0.28% మాత్రమే లాభపడ్డాయి. మిగిలిన 27 షేర్లూ నష్టపోయాయి.

**యుద్ధం మొదలయ్యాక రూ.48.29 లక్షల కోట్లు ఆవిరి**

పశ్చిమాసియా యుద్ధం మొదలైన తర్వాత ఫిబ్రవరి 28 నుంచి మార్చి 23 మధ్య) ఇన్వెస్టర్లు మొత్తం 15 ట్రేడింగ్ సెషన్లలో రూ.48.29 లక్షల కోట్లు కోల్పోయాయి. సెన్సెక్స్ 8,591 పాయింట్లు (10.56%), నిఫ్టీ 2,666 పాయింట్లు(10.58%) నష్టపోయాయి. తాజా గా సోమవారం ఒక్కరోజే రూ.14 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద హరించుకుపోయింది. దీంతో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.414.77 లక్షల కోట్లకు దిగివచ్చింది.

**నష్టాలు ఎందుకంటే**

హార్మూజ్ జలసంధి అంశంపై అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో తాజా యుద్ధ భయాలు మార్కెట్లను కుదిపేశాయి. జలసంధి మూసివేత హెచ్చరికలతో క్రూడ్ బ్యారెల్ 110 డాలర్లపైకి చేరుకుంది. దీంతో ద్రవ్యోల్బణం మరింత పెరగడమే కాకుండా, వృద్ధి మందగమన ఆందోళనలు తలెత్తాయి. చమురు దిగుమతుల భారం, ఎఫ్ఐఐల భారీ అమ్మకాలతో రూపాయి సరికొత్త కనిష్టాలను తాకింది. యుద్ధం మొదలైన తర్వాత విదేశీ ఇన్వెస్టర్ల భారీ విక్రయాలు మార్కెట్‌ను మరింత బలహీనపరిచింది.

**ఆసియా మార్కెట్లు డౌన్.. లాభాల్లోకి యూరప్, యూఎస్**

పశ్చిమాసియా యుద్ధం ఇప్పట్లో ఆగకపోవచ్చనే ఆందోళనలతో ఆసియా మార్కెట్ల పతనం కొనసాగింది. ఫలితంగా దక్షిణ కొరియా 7%, చైనా 4%, జపాన్ 3.60%, హాంగ్‌కాంగ్ 3.54%, తైవాన్ 2.50%, సింగపూర్ 2.22 శాతం క్షీణించాయి. మన మార్కెట్ ముగిసిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో పరిస్థితులు తారుమారయ్యాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణలకు 'సంపూర్ణ, శాశ్వత పరిష్కారం' కనుగొనే దిశగా 'ఫలప్రదమైన చర్చలు' జరిగినట్లు ట్రంప్ తెలిపారు. ఇందులో భాగంగా ఇరాన్ విద్యుత్ ప్లాంట్లు, ఇంధన మౌలిక సదుపాయాలపై చేయాలనుకున్న 'అన్ని రకాల దాడులను అయిదు రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు' ట్రంప్ ప్రకటించారు. దీంతో యూరప్, అమెరికా స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా బౌన్స్‌బ్యాక్ అయ్యాయి. జర్మనీ డాక్స్ ఇండెక్స్ 3%, జర్మనీ సూచీ సీఏసీ సూచీ 2%, బ్రిటన్ ఎఫ్‌టీఎస్ఈ 1% పెరిగాయి. అమెరికా నాస్‌డాక్ ఇండెక్స్ 2.25%, డోజోన్స్ 2.50%, ఎస్అండ్‌పీ-500 సూచీ 2% లాభాల్లో ట్రేడవుతున్నాయి.




# ఇన్‌సైడర్ పరిధిలోకి సెబీ ఛైర్మన్

ముంబయి: 'పరస్పర విరుద్ధ ప్రయోజనాలు', సెబీ అధికారుల వెల్లడి నిబంధనలపై ఉన్నత స్థాయి కమిటీ చేసిన పలు సిఫారసులను సెబీ బోర్డు సోమవారం ఆమోదించింది. ఈ కమిటీకి విజిలెన్స్ మాజీ చీఫ్ కమిషనర్ ప్రత్యూష్ సిన్హా అధ్యక్షత వహించారు. సెబీ సభ్యులు, అధికారుల ఆస్తులు, పెట్టుబడులు, రుణాలు, ఇతర సంబంధిత విషయాల వెల్లడికి సంబంధించిన ప్రస్తుత నిబంధనలను సమగ్రంగా సమీక్షించడానికి ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సెబీ ఛైర్మన్, పూర్తి స్థాయి సభ్యులను కూడా 'ఇన్‌సైడర్' పరిధిలోకి తీసుకురానున్నట్లు సెబీ తెలిపింది. బోర్డు సభ్యులు, ఉద్యోగులు విధుల్లో చేరినప్పుడు, ఏటా, నిర్దిష్ట సందర్భాల్లో, విధులను వదిలి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా వారి ఆర్థిక వివరాలను వెల్లడించాలని కమిటీ సూచించింది.

**సంక్షిప్త రూపంలోనూ ఐపీఓ వివరాలు**

దిల్లీ: తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) వివరాల వెల్లడిని సులభతరం చేసి మదుపర్లకు మరింత అనుకూలంగా మార్చే ఉద్దేశంతో ఆఫర్ పత్రాలను సంక్షిప్త రూపంలో అందించే విధానాన్ని సెబీ అందుబాటులోకి తెచ్చింది. ఐపీఓ వివరాలను పూర్తి స్థాయిలో పొందుపరిచే డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌తో పాటు.. సంక్షిప్త రూపంలో తెలియజేసే డ్రాఫ్ట్ అబ్రిడ్జెడ్ ప్రాస్పెక్టస్‌ను కూడా పబ్లిక్ ఇష్యూకు వచ్చే కంపెనీలు ఇకపై సమర్పించాల్సి ఉంటుంది. వ్యాపార విధానం, ఆర్థిక పరమైన అంశాలు, ప్రమోటర్లు, రిస్క్‌లు, కీలక పనితీరు సూచీల వివరాలు సులువుగా అర్థం చేసుకునేలా ఈ పత్రంలో ఉండనున్నాయి. ఇష్యూకు రాబోయే కంపెనీ వెబ్‌సైట్, ఎక్కడైతే షేర్లు నమోదు చేయనుందో, ఆ స్టాక్‌ఎక్స్ఛేంజీలు, లీడ్ మేనేజర్ల వద్ద ఈ అబ్రిడ్జెడ్ ప్రాస్పెక్టస్‌ను అందుబాటులో ఉంచాలని సెబీ తెలిపింది. ఈ సంక్షిప్త పత్రాల్లో కంపెనీ ప్రాథమిక వ్యాపార వివరాలను 500 పదాల్లోపే తెలియజేయాల్సి ఉంటుంది.

# యుద్ధానికి బ్రేక్.. ఒక్కసారిగా తగ్గిన చమురు ధరలు!



''ఇరాన్‌తో యుద్ధానికి బ్రేక్ ఇస్తున్నాం, తాత్కాలికంగా యుద్ధాన్ని ఆపేస్తున్నాం, మరో ఐదు రోజుల పాటు యుద్ధాన్ని నిలిపేస్తున్నాం'' చర్చలు జరుగుతున్నాయని అమెరిక అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని క్షణాలకే చమురు ధరలు 13 శాతానికి పైగా పడిపోయాయి. ఇదే సమయంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 96 డాలర్లకు, అంటే 14 శాతం వరకు తగ్గింది. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ సుమారు 17 డాలర్లు, అంటే 15 శాతం పడిపోయి, 1108 GMT సమయానికి బ్యారెల్‌కు 96 డాలర్ల సెషన్ కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (WTI) 13 డాలర్లు, అంటే సుమారు 13.5 శాతం పడిపోయి, సెషన్ కనిష్ట స్థాయి అయిన 85.28 డాలర్లకు చేరింది.

అయితే.. ట్రంప్ పేర్కొన్నట్లు అటువంటి చర్చలు ఏవీ జరగలేదని ఇరాన్ ఖండించిన తర్వాత, చమురు ధరలు సుమారు 5 శాతం పెరిగి బ్యారెల్‌కు 101 డాలర్లకు చేరుకున్నాయి, కానీ మళ్లీ 100 డాలర్ల స్థాయి కంటే దిగువకు పడిపోయాయి. అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి బ్రెంట్ క్రూడ్ ధరలు 60 శాతానికి పైగా పెరిగాయి. సంఘర్షణకు ముందు బ్యారెల్‌కు సుమారు 70 డాలర్లుగా ఉన్న ఈ ధరలు, ప్రధానంగా హోర్ముజ్ జలసంధి ద్వారా చమురు సరఫరాకు అంతరాయం కలగడం, గల్ఫ్ ప్రాంతంలోని ఇంధన కేంద్రాలపై జరిగిన దాడుల కారణంగా, సోమవారం నాటికి బ్యారెల్‌కు సుమారు 112 డాలర్లకు చేరుకున్నాయి. దీన్నిబట్టి చూస్తే.. కేవలం గత 30 రోజుల్లోనే ముడి చమురు ధరలు ఎంత గరిష్టాలకు చేరుకున్నాయో స్పష్టమ



# 'వాహన్' పోర్టల్‌లో చేరిన తెలంగాణ

బేగంపేటలోని వరుణ్ మోటార్స్ భవనంలో వాహన్ పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ పరివాహన్ పోర్టల్‌లో చేరడం తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయమన్నారు. 2016లో వాహన్ అందుబాటులోకి రాగా తెలంగాణ ఇప్పుడు చేరిందన్నారు. వాహన్‌తో అన్ని వివరాలు కేంద్ర మంత్రిత్వ శాఖ డేటా బేస్‌లోకి వెళ్తాయని, దీంతో సేవలు మరింత పారదర్శకంగా అందుతాయని చెప్పారు. ఆర్టీసీ విలీనం, సంఘాల గుర్తింపు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు.

# సాయి పేరెంటరల్స్ ఐపీవో నేడు




హైదరాబాద్: ఫార్మాస్యూటికల్ కంపెనీ సాయి పేరెంటరల్స్ పబ్లిక్ ఇష్యూ నేడు(24న) ప్రారభమై శుక్రవారం(27న) ముగియనుంది. ధరల శ్రేణి రూ. 372–392. తద్వారా రూ. 409 కోట్లు సమీకరించనుంది. ఇష్యూలో భాగంగా యాంకర్ ఇన్వెస్టర్లకు షేరుకి రూ. 392 ధరలో 31,28,485 షేర్లు విక్రయించింది. తద్వారా రూ. 123 కోట్లు సమీకరించింది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 38 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. యాంకర్ పెట్టుబడులు.. తమ బిజినెస్ మోడల్, వృద్ధి అవకాశాలు, నిర్వహణ సామర్థ్యాలపట్ల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నట్లు సాయి పేరెంటరల్స్ ఎండీ అనిల్ కుమార్ కె. చెప్పారు.

# గంటల వ్యవధిలో కుప్పకూలిన పసిడి..

భారతదేశంలో బంగారం ధరలు భారీగా తగ్గాయి. ఉదయం రూ.5000 తగ్గిన రేటు.. సాయంత్రానికి రూ.10 వేలకు చేరింది. అంటే తులం గోల్డ్ రేటు రూ. పదివేలు తగ్గిందన్నమాట. దీంతో ధరల్లో చాలా వ్యత్యాసం కనిపించింది. ఈ కథనంలో తాజా ధరలు ఏ నగరంలో.. ఎలా ఉన్నాయనే వివరాలు చూసేద్దాం.

హైదరాబాద్, విజయవాడలలో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 10,320 తగ్గి.. రూ.1,35,650 వద్దకు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు 9450 రూపాయలు తగ్గి రూ. 1,23,450 వద్దకు చేరింది. దీన్నిబట్టి చూస్తే.. పసిడి ధరలు ఎంత వరకు పతనమైందో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

చెన్నైలో కూడా గోల్డ్ రేటు బాగా తగ్గింది. దీంతో ఉదయం ధరల కంటే.. సాయంత్రం ధరలు చాలా తగ్గుముఖం పట్టింది. దీంతో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.1,39,200 వద్దకు (రూ.9380 తగ్గింది). 22 క్యారెట్ల తులం రేటు రూ.1,27,600 వద్ద (రూ.8600 తగ్గింది) నిలిచింది.

ఢిల్లీలో బంగారం ధరల విషయానికి వస్తే.. ఇక్కడ 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.1,35,800 (రూ.10,320 తగ్గింది) వద్ద ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు 9450 రూపాయలు తగ్గి 1,24,500 రూపాయల వద్ద నిలిచింది. వెండి ధరల్లో మాత్రం ఎటువంటి మార్పు లేదు. కేజీ సిల్వర్ ధర రూ.2.30 లక్షల వద్ద కొనసాగుతోంది.







# ఈ ఇద్దరూ సై అంటే.. ప్రత్యేకమే?

అగ్ర కథానాయకులు అల్లు అర్జున్, రామ్‌చరణ్ సినిమాల విషయంలో కొన్ని ఆసక్తికరమైన సంగతులు వినిపిస్తున్నాయి. ఆ సంగతులు కూడా అనుష్కశర్మ, మృణాల్ ఠాకూర్‌లతో ముడిపడి ఉండటం విశేషం. ప్రచారంలో ఉన్నదే నిజమైతే మాత్రం వాళ్లు తీసుకున్న నిర్ణయాలు ఎంతో ప్రత్యేకం కానున్నాయి. మరి ఆ కథానాయికల నిర్ణయమేమిటన్నది త్వరలోనే వెలుగులోకి రానుంది. అల్లు అర్జున్ కథానాయకుడిగా.. అట్లీ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో కథానాయికలుగా ఇప్పటికే దీపికా పదుకొణె, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ ఎంపికైనట్టు ప్రచారం సాగుతోంది. తాజాగా ఆ జాబితాలో అనుష్కశర్మ పేరు కూడా చేరింది. ఆమె ప్రధాన కథానాయికగా నటించి చాలా రోజులైంది. అట్లీ సినిమాలో ఓ కీలకమైన పాత్ర కావడంతో చిత్రబృందం అనుష్కని సంప్రదించినట్టు తెలుస్తోంది. ఆమె ఒప్పుకున్నారంటే మాత్రం అనుష్కశర్మ నటించే తొలి తెలుగు సినిమా ఇదే అవుతుంది. ఆమె రీ ఎంట్రీ ఇచ్చిన సినిమా ఇదే అవుతుంది.

ఇక మృణాల్ ఠాకూర్ విషయానికొస్తే... ఆమెను రామ్‌చరణ్ సినిమా 'పెద్ది'లో ప్రత్యేకగీతం కోసం చిత్రబృందం సంప్రదించిందని సమాచారం. మృణాల్‌కు తెలుగు సినిమాలు కొత్త కాదు కానీ, ఆమె ప్రత్యేకగీతంలో మాత్రం ఇప్పటివరకూ చేయలేదు. ఈసారి ఒప్పుకున్నారంటే మాత్రం నిజంగానే అది ప్రత్యేకం కానుంది. 'పెద్ది' టాకీ భాగం చిత్రీకరణ తుదిదశకు చేరుకొంటోంది. అంతా పూర్తయ్యాక చిత్రబృందం ప్రత్యేకగీతం చిత్రీకరణపై దృష్టిపెట్టనుంది. ఈ నెలలోనే అందులో నటించే కథానాయికలు ఎవరనే విషయంపై స్పష్టత రానుంది. ఈ ప్రత్యేకగీతంలో ఇద్దరు కథానాయికలు నటించనున్నట్టు సమాచారం.




## 'బైకర్'పై ప్రభాస్ ప్రేమ.. ట్రైలర్‌పై ప్రశంసలు




'నారీ నారీ నడుమ మురారి' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన శర్వానంద్ (Sharwanand) ఇప్పుడు 'బైకర్' అనే స్పోర్ట్స్ డ్రామాతో మన ముందుకురాబోతున్నారు. భారత దేశపు మొట్టమొదటి మోటోక్రాస్ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఇప్పటికే 15 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సాధించి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. తాజాగా ఈ ట్రైలర్‌పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ (Prabhas) ప్రశంసలు కురిపించారు. తన ఇన్‌స్టాలో ట్రైలర్‌ను షేర్ చేసిన ఆయన.. చాలా ఎంగేజింగ్‌గా ఉందని, సినిమా వైబ్ బాగుందని చిత్ర బృందాన్ని ప్రశంసించారు. ఏప్రిల్ 3న విడుదల కానున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాజశేఖర్, మాళవిక నాయర్, అతుల్ కుల్‌కర్ణి కీలక పాత్రల్లో కనిపించనున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానుంది.

## ఇప్పట్లో ఆ ఆలోచన లేదు ..కరీనా కపూర్




ఆర్కే(రాజ్‌కపూర్) స్టూడియోస్‌తో భావోద్వేగ అనుబంధం ఉన్నప్పటికీ ఇప్పట్లో దాన్ని పునరుద్ధరించే ఉద్దేశం లేదంటోంది బాలీవుడ్ నటి కరీనా కపూర్. దివంగత ప్రముఖ హిందీ చిత్ర నటుడు, దర్శకనిర్మాత రాజ్‌కపూర్ 1948లో 'ఆర్కే స్టూడియోస్'ని ప్రారంభించారు. హిందీ సినిమా చరిత్రలో ఎన్నో క్లాసిక్ చిత్రాలను తెరపై ఆవిష్కరించిన ఆర్కే స్టూడియోస్‌కు ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానం ఉంది. ఇటీవల తమ తండ్రి నిర్మాణసంస్థను కపూర్ వారసులు తిరిగి ప్రారంభిస్తారని వస్తున్న ఊహాగానాలపై నటి కరీనా కపూర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించింది. ప్రస్తుతానికి అలాంటి ప్రణాళిక లేదని స్పష్టం చేశారు. కరీనా మాట్లాడుతూ "ఆర్కే స్టూడియోస్' విషయంలో వస్తోన్న వార్తలు నిజం కాదు. మా ఫ్యామిలీ గ్రూప్‌లో కూడా దీని గురించి చర్చ జరిగింది. అందరూ ఇది జరగదనే అన్నారు. ప్రేక్షకులు మాత్రం ఇది జరగాలని కోరుకుంటున్నట్లు నాకు అనిపిస్తుంది. రణ్‌బీర్ నటనపైనే దృష్టి పెట్టాడని అనుకుంటున్నాను. అతనికి నటన అంటే చాలా ఇష్టం. ప్రస్తుతం ఇండియాలో అతనే అత్యుత్తమ నటుడని నేను భావిస్తున్నాను. అందుకే అతని దృష్టి దానిపైనే ఉంది. కానీ, ఆర్కే స్టూడియోస్‌ని పునరుద్ధరించే ప్రణాళికలు మాత్రం చేయడం లేదు. దీని గురించి రణ్‌బీర్ ఆలోచించాలి. ఎందుకంటే నేను ఒక దర్శకురాలిగా లేదా నిర్మాతగా ఆలోచించగలనని అనుకోవడం లేదు" అని చెప్పింది.

**మినీ సిరీస్ చేయాలనుంది..** "ఈ ఏడాది భిన్నంగా ఏదైనా చేయాలని అనుకుంటున్నా. కొత్తగా సవాలుతో కూడిన పాత్రలు ప్రయత్నించాలి. నేను మేఘనా గుల్జార్‌తో కలిసి ఎప్పుడూ పని చేయలేదు. ఆమె ఒక అద్భుతమైన దర్శకురాలు. ఇప్పుడు నేను ఆమె తెరకెక్కిస్తున్న సినిమాలో నటిస్తున్నా. వాస్తవిక అంశాలపై ఆధారపడి ఉంటుందీ చిత్రం. దీనిని తెరపై చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఒక మంచి షో లేదా మినీ సిరీస్ లాంటివి చేయాలని ఉంది".

## 'ధురంధర్ 2' విజయం.. 28 ఏళ్ల నాటి లేఖ పంచుకున్న నటుడు

'ధురంధర్ 2' సంచలనం సృష్టిస్తోన్న వేళ.. ఇందులో కీలకపాత్రలో నటించిన సీనియర్ నటుడు గౌరవ్ తన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ చిత్రంలో (Dhurandhar 2) మహమ్మద్ ఆలం పాత్రతో మెప్పించిన ఆయన తాజాగా ఓ లేఖను పంచుకున్నారు. 1998లో తాను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తన తల్లిదండ్రులకు రాసిన లేఖను షేర్ చేశారు. దిల్లీ నుంచి ముంబయి వచ్చిన రోజుల్లో తన ఆర్థిక ఇబ్బందులను అందులో ప్రస్తావించారు. "ఇది 1998లో మా అమ్మానాన్నలకు రాసిన లేఖ. నేను ముంబయికి వచ్చి అప్పటికి నెల రోజులు కూడా కాలేదు. అప్పట్లో ఈమెయిల్‌లు లేవు, కేవలం ఉత్తరాలే. ఆ తర్వాత టీవీ, సినిమాలు, యాడ్స్, రేడియో, రీల్స్.. ఇలా ఎన్నో ఒడుదొడుకులతో నా ప్రయాణం సాగింది. అప్పట్లో నా భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియదు కానీ, నేనెప్పుడూ ఆశను కోల్పోలేదు. నాకు అండగా నిలిచిన మా అమ్మానాన్నలకు ధన్యవాదాలు" అంటూ లేఖను పంచుకున్నారు. అందులో తన తల్లిదండ్రులకు అప్పటి పరిస్థితిని వివరించారు గౌరవ్. "ప్రస్తుతానికి డబ్బు పరంగా ఏమీ కలిసిరావడం లేదు. కానీ, త్వరలోనే మంచి జరుగుతుందని ఆశిస్తున్నాను. దిల్లీతో పోలిస్తే ఇక్కడ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ఖర్చు తగ్గించుకోవడానికి నేను స్నేహితుడితో కలిసి ఓ చిన్న గదిలో ఉంటున్నాను. టెలిఫోన్, విద్యుత్, గ్యాస్, నీటి బిల్లులతో పాటు భోజనం ఖర్చులు కూడా ఇద్దరం కలిసే పంచుకుంటున్నాం. భవిష్యత్తుపై ఆశతో జీవిస్తున్నాను. కానీ నేను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది" అని రాసి ఉన్న లేఖ ప్రస్తుతం వైరల్ అవుతోంది. దీనిపై బాలీవుడ్ ప్రముఖులు స్పందిస్తున్నారు. పట్టుదలతో శ్రమిస్తే ఏదో ఒకరోజు గుర్తింపు లభిస్తుందంటూ ప్రశంసిస్తున్నారు.



# పవన్ కల్యాణ్ కొత్త సినిమాలపై రూమర్లు ..స్పందించిన నిర్మాణ సంస్థ

'హరి హర వీరమల్లు', 'ఓజీ', 'ఉస్తాద్ భగత్‌సింగ్'.. ఇలా తక్కువ సమయంలోనే మూడు సినిమాలతో ప్రేక్షకులను పలకరించారు పవన్ కల్యాణ్. తదుపరి సినిమా ఎవరితో? ఏపీ డిప్యూటీ సీఎంగా ప్రజా సేవలో ఉన్న ఆయన్ను మళ్లీ తెరపై ఎప్పుడు చూస్తామో అన్న చర్చ అభిమానుల్లో మొదలైంది. ఈ క్రమంలో వచ్చిన రూమర్లపై 'పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' సంస్థ స్పందించింది. "ప్రస్తుతానికి పవన్ కల్యాణ్ ఏ కొత్త సినిమానీ అంగీకరించలేదు. ఆయన తదుపరి చిత్రాలపై వస్తున్న ఊహాగానాల్లో ఎలాంటి నిజం లేదు. వెంటనే కొత్త సినిమాలు చేయాలన్న ప్రణాళికలు లేవు. ఒకవేళ ఏదైనా ప్రాజెక్టు ఓకే అయితే.. అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా తెలియజేస్తాం. ఇక 'ఓజీ 2' అప్‌డేట్ విషయానికొస్తే.. సరైన సమయంలో పవన్ కల్యాణే దాని గురించి చెబుతారు" అని నిర్మాణ సంస్థ పేర్కొంది. సామాజిక అంశాలే ఇతివృత్తంగా సినిమాలు తెరకెక్కించే ఓ దర్శకుడితో పవన్ వర్క్ చేయనున్నారంటూ జోరుగా ప్రచారం జరగ్గా.. సంస్థ రియాక్ట్ అయింది.

**సురేందర్ రెడ్డితో ఇలా..**

పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు సురేందర్ రెడ్డి కొన్నాళ్ల క్రితమే సినిమా ప్రకటించిన సంగతి తెలిసిందే. పలు కారణాల వల్ల ఈ మూవీ వాయిదా పడుతూ వస్తోంది. పూర్తిస్థాయిలో స్క్రిప్ట్‌ని సిద్ధం చేసిన సురేందర్.. పవన్‌కు చెప్పే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఇది ఇప్పటికే ఖరారైన కాంబినేషన్ కాబట్టి.. పవన్ తదుపరి సినిమా సురేందర్‌తోనే ఉండే అవకాశం ఉంది.



## మోహన్‌లాల్ అభిమానులకు బ్యాడ్ న్యూస్.. 'దృశ్యం 3' వాయిదా



మోహన్‌లాల్ అభిమానులకు, సినీ ప్రియులకు బ్యాడ్ న్యూస్. మోహన్‌లాల్ కథానాయకుడిగా నటించిన 'దృశ్యం3' (drishyam 3) విడుదల వాయిదా పడింది. చిత్ర బృందం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించింది. ఈ మేరకు మోహన్‌లాల్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'గతం ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉండదు. వేచి చూస్తూ ఉంటుంది. జార్జ్‌కుట్టి మే 21, 2026న (drishyam 3 release date) వస్తున్నాడు' అని పేర్కొన్నారు. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో ఈ మూవీ రూపొందిన సంగతి తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'దృశ్యం' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకున్నాయి. ఇప్పుడు మూడో భాగం అలరించేందుకు సిద్ధమైంది.

మరోవైపు హిందీ 'దృశ్యం3' కూడా షూటింగ్ శరవేగంగా జరుపుకొంటోంది. అజయ్ దేవ్‌గణ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ మూవీ అక్టోబరు 2న విడుదల కానుంది. అనుకోకుండా జరిగిన ఓ హత్య చుట్టూ సాగే కుటుంబ కథ నేపథ్యంలో 'దృశ్యం' సినిమాలు తెరకెక్కాయి. మలయాళంలో మోహన్‌లాల్, తెలుగులో వెంకటేష్ (Venkatesh) కథానాయకులుగా అలరించారు. మలయాళంలో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలు ఇప్పటివరకు తెలుగు, తమిళంతోపాటు హిందీలోనూ రీమేక్ అయి ప్రేక్షకుల్ని మెప్పించాయి.

## మే 1న 'గాయపడ్డ సింహం'.. షరతులు వర్తిస్తాయి!

ఇటీవలే 'ఓం శాంతి శాంతి శాంతి' చిత్రంతో హీరోగా ప్రేక్షకుల్ని పలకరించారు దర్శకుడు తరుణ్ భాస్కర్. ఇప్పుడు 'గాయపడ్డ సింహం'తో మరోసారి అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన.. ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ఈ చిత్రాన్ని కశ్యప్ శ్రీనివాస్ తెరకెక్కించారు. పవన్ సాదినేని సమర్పణలో సప్తస్య మీడియా వర్క్స్, పీఓవీ స్టోరీస్, జీ స్టూడియోస్ సంస్థలు నిర్మించాయి. మానస చౌదరి, విష్ణు ఓయ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాని మే 1న థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. "టీజర్ చాలా బాగుంది. కాన్సెప్ట్ కూడా బాగా నచ్చడంతో దీన్ని మేమే ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. విడుదల తేదీగా మే 1ని ఖరారు చేశాం. కాకపోతే కండీషన్స్ అప్లై. ఎందుకంటే ఏప్రిల్ 30న 'పెద్ది' విడుదల కానుంది. అది వస్తే.. దీనికి థియేటర్లు ఇవ్వలేని పరిస్థితి ఉంటుంది.

అందుకే అవసరం అనుకుంటే వారం వెనక్కి వెళ్లే వెసులుబాటు ఉంటుందని కండీషన్స్ అప్లై అని చెప్పాం" అన్నారు. "ఈ చిత్రంలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. వాటిలో ఒకదాన్ని త్వరలోనే బయట పెడతాం" అన్నారు సమర్పకుడు పవన్ సాదినేని. ఈ కార్యక్రమంలో భాను కిరణ్, కశ్యప్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఐసీసీ ఉత్తమ ప్లేయర్‌గా అరుంధతి



భారత పేసర్ అరుంధతి రెడ్డి ఫిబ్రవరికిగాను ఐసీసీ 'ఉత్తమ మహిళా క్రికెటర్'గా నిలిచింది. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌లో అరుంధతి (4/22, 2/30, 2/35) అద్భుతంగా రాణించింది. భారత్ 21తో సిరీస్ నెగ్గడంలో ప్రధాన పాత్ర ఆమెదే. ''ఈ అవార్డు దక్కడం చాలా గౌరవంగా భావిస్తున్నా. ఆసీస్‌ను వారి సొంతగడ్డపై ఓడించడం అంత సులువు కాదు. వారిపై గెలిచిన తర్వాత ఈ అవార్డు అందుకోవడం మరింత ప్రత్యేకం'' అని అరుంధతి చెప్పింది. పురుషుల విభాగంలో పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ అవార్డును దక్కించుకున్నాడు. టీ20 ప్రపంచకప్‌లో అతడు రెండు శతకాలు (శ్రీలంక, నమీబియాలపై) సహా 383 పరుగులు (7 మ్యాచ్‌ల్లో) సాధించాడు.

## ఆసియా ఆర్చరీలో చికిత




బ్యాంకాక్: తెలంగాణ అమ్మాయి తానిపర్తి చికిత ఆసియాకప్ స్టేజ్ 1 ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగనుంది. మంగళవారం బ్యాంకాక్‌లో ఆరంభం కానున్న ఈ పోటీల్లో మహిళల కాంపౌండ్ విభాగంలో చికిత పోటీపడనుంది. జ్యోతి సురేఖ, అభిషేక్ వర్మ, దీపిక కుమారి, ధీరజ్ బొమ్మదేవర, తరుణ్‌దీప్ రాయ్ లాంటి స్టార్ ఆర్చర్లు లేకుండానే భారత్ ఈ ఛాంపియన్‌షిప్‌లో ఆడుతోంది. కాంపౌండ్‌లో ప్రపంచ నాలుగో ర్యాంక్ ఆర్చర్ రిషబ్ యాదవ్, రజత్ చౌహాన్, ప్రథమేశ్ పతక రేసులో ఉన్నారు. ఆసియాకప్ రెండో అంచెలో పసిడి గెలిచిన 18 ఏళ్ల తేజల్ సాల్వేపై కూడా అంచనాలు ఉన్నాయి. కాంపౌండ్ టీమ్‌లో గత కప్‌లో స్వర్ణం గెలిచిన భారత్.. మరోసారి సత్తా చాటాలని భావిస్తోంది. ఈ పోటీల్లో మొత్తం 19 దేశాల నుంచి దాదాపు 200 మంది ఆర్చర్లు బరిలో ఉన్నారు. కొరియా ఈ కప్‌లో ఆడట్లేదు.

**భారత జట్టు:** రికర్వ్: దేవాంగ్ గుప్తా, ఆర్ణవ్ పునియా, జుయెల్ సర్కార్, సుఖ్‌చైన్ సింగ్; మహిళలు: క్రితి, అన్షిక, రుమా బిస్వాస్, రిధి; కాంపౌండ్: రజత్ చౌహాన్, ప్రథమేశ్, ఉదయ్, రిషబ్ యాదవ్; మహిళలు: చికిత, స్వాతి, రాజ్ కౌర్, తేజల్.

## పవర్ ప్లేలో నువ్వేలా ఆడతావు నితీశ్.. ఇషాన్ ఫన్నీ కామెంట్స్



సన్‌రైజర్స్ ఆటగాళ్లు ఫ్యాన్ మీట్ నిర్వహించారు. కెప్టెన్ ఇషాన్ కిషన్, వైస్ కెప్టెన్ అభిషేక్ శర్మతోపాటు తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, జయదేవ్, హర్షల్ పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ కొన్ని ప్రశ్నలు సంధించారు. వాటికి జవాబు చెబుతుండగానే.. కెప్టెన్ నితీశ్ మధ్యలో కలగజేసుకుంటూ ఇచ్చిన సమాధానాలు అభిమానులను అలరించాయి.

# ఈసారి చెన్నై సిక్సర్ కొడుతుందా?

**ఐపీఎల్‌లో ముంబయితో పాటు అత్యంత విజయవంతమైన జట్టు చెన్నై సూపర్‌కింగ్స్. ఏకంగా అయిదుసార్లు టైటిల్ గెలుచుకుంది. కానీ గత రెండేళ్లలో తీవ్రంగా తడబడింది. ఘనమైన గతానికి నీడలా కనిపించింది. ఆ జోరే లేదు. కానీ ఈసారి జట్టులో అనేక మార్పులు చేసి, కుర్రాళ్లను చేర్చుకుని ఉత్సాహంగా పోరుకు సిద్ధమైంది. మరి 2026 ఐపీఎల్‌లో సీఎస్కే పుంజుకుంటుందా..!**



ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా ఐపీఎల్‌లో ఎప్పుడూ గట్టి పోటీదారుగా ఉంటుంది చెన్నై సూపర్‌కింగ్స్. చాలా ఏళ్లు మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్సీలో ఆ జట్టుకు ఉన్న ఆకర్షణే వేరు. అత్యధిక మంది అభిమానులు అనుసరించే జట్లలో ఒకటి సీఎస్కే. రికార్డు అలాంటిది మరి. అత్యధికంగా పదిసార్లు ఫైనల్‌కు దూసుకెళ్లింది. 2019 వరకు ఆ జట్టు ప్రతిసారీ ప్లేఆఫ్స్‌లో ప్రవేశించడం విశేషం. ధోనితో పాటు రైనా, డుప్లెసిస్, బ్రావో.. ఇలా ఎందరో మేటి ఆటగాళ్లు ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అయితే రికార్డు ఘనంగా ఉన్నా.. గత రెండు సీజన్లలో చెన్నై ప్రదర్శన పేలవం. కనీసం గ్రూప్ దశ దాటలేకపోయింది. 2025లో అయితే తమ చరిత్రలో తొలిసారి పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. ఈ నేపథ్యంలో అనేకమంది అనుభవజ్ఞులను వదిలేసి, జట్టును యువ రక్తంతో నింపిన ఆ జట్టు... ఈసారి బలంగా పుంజుకోవాలనే పట్టుదలతో పోటీకి సిద్ధమైంది. సీనియర్ ఆల్‌రౌండర్లు జడేజా, సామ్‌కరన్‌తో పాటు దీపక్ చాహర్, రాహుల్ త్రిపాఠి, విజయ్ శంకర్‌లను విడుదల చేసిన చెన్నై.. వేలంలో యువ ఆటగాళ్లు ప్రశాంత్ వీర్, కార్తీక్ శర్మలతో పాటు అకీల్ హొసేన్, షార్ట్, రాహుల్ చాహర్ వంటి వారిని సొంతం చేసుకుంది. ఇప్పుడు అనుభవజ్ఞులు, కుర్రాళ్ల మేలు కలయికతో రికార్డు స్థాయిలో ఆరో టైటిల్‌పై కన్నేసింది. ముందు చెపాక్‌పై పట్టు సాధించాలన్నది ఆ జట్టు లక్ష్యం. తమకు కోట లాంటి ఆ స్టేడియంలో కిందటిసారి చెన్నై.. ఏడు మ్యాచ్‌ల్లో అయిదు ఓడిపోయింది. చాలా ముందే ఐపీఎల్ సన్నాహాలను మొదలెట్టిన ఆ జట్టు తన లక్ష్య సాధనలో ఏమేర విజయవంతమవుతుందో చూడాలి. రాజస్థాన్ నుంచి వచ్చిన సంజు శాంసన్ తొలిసారి సీఎస్కే తరఫున బరిలోకి దిగబోతున్నాడు.

**బలాలు:....** ఈ సీజన్‌లో చెన్నైకి అతి పెద్ద బలం ప్రధానంగా కుర్రాళ్లతో కూడిన బ్యాటింగ్ లైనప్పే. గత సీజన్‌లో అనుభవజ్ఞులకే పెద్ద పీట వేసిన సీఎస్కే ఈసారి వర్ధమాన బ్యాటర్ల వైపు మొగ్గుచూపింది. కెప్టెన్‌గా కొనసాగనున్న రుతురాజ్ గైక్వాడ్ యాంకర్






పాత్రను పోషిస్తాడు. గత సీజన్‌కు అతడు అందుబాటులో లేని సంగతి తెలిసిందే. ఇంకా సంజు శాంసన్, ఆయుష్ మాత్రే, ఉర్విల్‌పటేల్, బ్రెవిస్, ధోనిలతో లైనప్ బలంగా కనిపిస్తోంది. చాలా మంది కుర్రాళ్లు ఎలాంటి భయం లేకుండా టోర్నీలో అడుగుపెడుతున్నారు. సత్తా చాటాలనుకుంటున్నారు. ఇది చెన్నైకి గొప్ప సానుకూలాంశం. అన్నింటికన్నా ముఖ్యంగా జట్టులో సంజు శాంసన్ చేరిక చెన్నై ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. టీ20 ప్రపంచకప్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌లతో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచిన అతడు.. అద్భుత ఫామ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. పవర్‌ప్లేలో అతడు బ్యాట్ ఝుళిపిస్తే సీఎస్కే పని తేలికవుతుంది.

**బలహీనతలు:....** కుర్రాళ్లు చెన్నైకి బలమే. కానీ అదే సమయంలో వాళ్లకు ఐపీఎల్ అనుభవం లేకపోవడం ప్రతికూలాంశం కూడా. వేలంలో భారీ మొత్తాలు పొందడం వల్ల రాణించాలనే ఒత్తిడి వాళ్లపై ఉంటుంది. కీలక సమయాల్లో అది ఆ ఆటగాళ్ల ప్రదర్శనపై ప్రభావం చూపొచ్చు. బౌలింగ్ కూడా చెన్నైకి సమస్యగానే ఉంది. ఈ విభాగంలో అనుభవం లోపించింది. ఇప్పటికే నిరూపించుకున్న మ్యాచ్ విన్నర్లు లేరు. గాయపడే అవకాశమున్న వాళ్లు ఎక్కువ మంది ఉన్నారు. నైపుణ్యాలపై సందేహాలు లేకున్నా.. ఒత్తిడిని తట్టుకోవడం, ప్రణాళికలను నిలకడగా అమలు చేయడంలో ఆ బౌలర్లు ఏమేర సఫలమవుతారన్నది ప్రశ్న!

ముఖ్యంగా ఆఖరి ఓవర్లలో బౌలింగ్ సవాలే. ప్రభావవంతంగా యార్కర్లు వేసే పేసర్లు లేరు. అన్షుల్ కాంబోజ్ నిరుడు 8 వికెట్లు మాత్రమే పడగొట్టాడు. ఖలీల్ 15 వికెట్లు చేజిక్కించుకున్నా... ధారాళంగా పరుగులిచ్చాడు. ముకేశ్‌పై నమ్మకం పెట్టుకోలేని పరిస్థితి. కట్టుదిట్టంగా బౌలింగ్ చేయలేదు. కీలక ఫాస్ట్‌బౌలర్ నాథన్ ఎలిస్ (ఆస్ట్రేలియా) గాయంతో దూరం కావడం చెన్నైకి పెద్ద దెబ్బ. అతడి స్థానంలో ఆస్ట్రేలియాకే చెందిన పేసర్ స్పెన్సర్ జాన్సన్‌ను చెన్నై జట్టులోకి తీసుకుంది. జాన్సన్ గతంలో గుజరాత్, కోల్‌కతాకు ప్రాతినిధ్యం వహించాడు. కానీ పెద్దగా రాణించలేకపోయాడు. నిరుడు సూపర్‌గా బౌలింగ్ చేసిన ఎడమచేతి వాటం స్పిన్నర్ నూర్ అహ్మద్‌కు లెగ్‌స్పిన్నర్ శ్రేయస్ గోపాల్ ఏమాత్రం సహకారమందిస్తాడో?

**జట్టు...**

**స్వదేశీ ఆటగాళ్లు:** రుతురాజ్, ధోని, సంజు శాంసన్, ఆయుష్ మాత్రే, కార్తీక్ శర్మ, సర్ఫరాజ్ ఖాన్, ఉర్విల్ పటేల్, ప్రశాంత్ వీర్, అన్షుల్ కాంబోజ్, రామకృష్ణ ఘోష్, అమన్ ఖాన్, శివమ్ దూబె, ఖలీల్, ముకేశ్ చౌదరి, శ్రేయస్ గోపాల్, రాహుల్ చాహర్, గుర్జన్‌ప్రీత్ సింగ్.

**విదేశీయులు:** బ్రెవిస్, మ్యాట్ హెన్రీ, ఒవర్టన్, మాథ్యూ షార్ట్, ఫౌక్స్, నూర్ అహ్మద్, స్పెన్సర్ జాన్సన్, అకీల్ హొసేన్.

**వీళ్లు కీలకం:** సంజు శాంసన్, రుతురాజ్, బ్రెవిస్, నూర్ అహ్మద్, దూబె.


**అత్యుత్తమ ప్రదర్శన:** అయిదుసార్లు (2010, 2011, 2018, 2021, 2023) ఛాంపియన్

# రణరంగం మధ్య చదరంగం ఆడలేను: కోనేరు హంపి

ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీ నుంచి తప్పుకోవాలని భారత దిగ్గజ క్రీడాకారిణి కోనేరు హంపి తీసుకున్న నిర్ణయం క్రీడారంగంలో చర్చనీయాంశమవుతోంది. యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రాంతంలో.. యుద్ధనౌకల పహారా మధ్య ప్రశాంతంగా ఆడటం సాధ్యంకాదని హంపి చెప్పింది. ఈ నిర్ణయం వల్ల భారీ జరిమానా ఎదుర్కోవాల్సి వచ్చినా తాను భయపడటం లేదని.. భద్రత కంటే ఏదీ ముఖ్యం కాదని ఆమె పేర్కొంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రికత్తల నేపథ్యంలో యుద్ధ ప్రాంతానికి చేరువలో ఉన్న సైప్రస్‌లో ఆడటం సురక్షితం కాదని రెండుసార్లు ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్ హంపి అభిప్రాయపడింది. ''ద్వీప దేశం సైప్రస్‌ను చుట్టుముట్టి యుద్ధనౌకలు పహారా కాస్తుంటే అక్కడ ప్రశాంతంగా ఎలా ఆడగలం? ఒక మహిళగా.. విదేశీయురాలిగా ముఖ్యమైన టోర్నీ కోసం అంత దూరం ప్రయాణించినా ప్రశాంతంగా ఆడగలనా? క్రీడాకారులు నిజాలను బయటపెట్టకుండా ఉండేందుకే కఠినమైన నిబంధనలు ఉంటాయి. వాటి గురించి నాకు ఏమాత్రం భయం లేదు. కేవలం డబ్బు లేదా ఆర్థిక ప్రయోజనాల కోసమో చెస్ ఆడటం లేదు. ఆటను మనస్ఫూర్తిగా ప్రేమిస్తాను కాబట్టే చెస్ ఆడుతున్నా. ఈ టోర్నీ కోసం మూడు నెలలు నా కుమార్తెకు దూరంగా ఉండి కష్టపడ్డా. ముఖ్యమైన టోర్నీకి దూరమవడం నాకూ బాధగానే ఉంది. సైప్రస్‌కు వెళ్లొద్దంటూ అమెరికా, బ్రిటన్ దేశాలు లెవెల్ 3 హెచ్చరికలు జారీచేశాయి. జమ్మూకశ్మీర్ కూడా లెవెల్ 3లోనే ఉంది. మరి అక్కడ ఇలాంటి టోర్నీని నిర్వహించొచ్చు కదా? అందులో తప్పేముంది? సైప్రస్ వంటి ప్రదేశాలు భారత్‌లో చాలానే ఉన్నాయి. కేవలం విలాసవంతమైన రిసార్టులు ఉంటే సరిపోదు. చెస్ ఆడేందుకు ఆహ్లాదకరమైన వాతావరణం కూడా అవసరం'' అని హంపి వివరించింది. ఈ టోర్నీలో పాల్గొంటున్న ఇతర భారత క్రీడాకారులు ప్రజ్ఞానంద, వైశాలి, దివ్య దేశ్‌ముఖ్‌ల గురించి మాట్లాడేందుకు హంపి నిరాకరించింది. ''వేరేవాళ్ల గురించి మాట్లాడదల్చుకోలేదు. అది వారిష్టం. ప్రతి ఒక్కరికి సొంత ఆసక్తులు.. ఆందోళనలు ఉంటాయి. నా నిర్ణయం నాకు సరైనదనే అనిపిస్తోంది'' అని తెలిపింది. మరోవైపు హంపి స్థానంలో ఉక్రెయిన్ క్రీడాకారిణి అనా ముజిచుక్‌ను ఫిడె ఎంపిక చేసింది. గతంలో ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో ముజిచుక్ ఛాంపియన్‌గా నిలిచింది.



# వైభవ్ సూర్యవంశీపై అందరి కళ్లూ.. రాణిస్తే టీమ్‌ఇండియాలో ఛాన్సు!



14 ఏళ్ల కుర్రాడికి ఐపీఎల్‌లో అవకాశం దక్కడమే గొప్ప. అలాంటిది గత ఏడాది ఆ వయసులో బరిలోకి దిగి విధ్వంసక బ్యాటింగ్‌తో అందరినీ ఆశ్చర్యపరిచాడు వైభవ్ సూర్యవంశీ. గత ఏడాది కాలంలో అండర్ 19 స్థాయిలో నిలకడగా రాణించిన ఈ కుర్రాడిపై ఈ ఐపీఎల్ ముంగిట అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిన్నోడు ఈసారి కూడా ఐపీఎల్‌లో రాణించాడంటే.. టీమ్‌ఇండియాలో చోటు రూపంలో పెద్ద అవకాశం అతడి తలుపు తట్టే అవకాశముంది. ఐపీఎల్ ఆరంభమవుతుంటే.. అభిమానుల దృష్టి ఆటోమేటిగ్గా విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, మహేంద్ర సింగ్ ధోని లాంటి సూపర్ స్టార్ల మీదికి మళ్లుతుంది. ఈసారి వాళ్లు ఎలా ఆడతారో.. వాళ్ల జట్లు ఎలాంటి ప్రదర్శన చేస్తాయో అని చర్చించుకుంటారు. లీగ్‌కు ఆకర్షణ తెచ్చేది, స్టేడియాలకు అభిమానులను రప్పించేది ఇలాంటి ఆటగాళ్లే. ఐతే ఈసారి ఇలాంటి లెజెండరీ క్రికెటర్లతో పాటు ఆసక్తి రేకెత్తిస్తున్న యువ ఆటగాళ్లలో వైభవ్ సూర్యవంశీ ఒకడనడంలో సందేహం లేదు. 14 ఏళ్ల చిన్న వయసులోనే అతను అభిమానుల దృష్టిని అమితంగా ఆకర్షిస్తున్నాడు. ఈసారి అతడి ఆట చూసేందుకు స్టేడియాలకు రావడమే కాదు.. టీవీల్లోనూ అభిమానులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. గత ఏడాదిగా తన ఆట అంతగా చర్చనీయాంశం అయింది మరి. ఈ సీజన్లో అంచనాలకు తగ్గట్లు రాణిస్తే.. అతను స్టార్‌గా అవతరించే అవకాశముంది.

**13 ఏళ్లకే 1.10 కోట్లు.....** ఐపీఎల్ ఆరంభం నుంచి రాజస్థాన్ రాయల్స్ కుర్రాళ్లకే పెద్ద పీట వేస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గత ఐపీఎల్ సీజన్ ముంగిట వేలంలో వైభవ్ సూర్యవంశీని ఆ జట్టు ఎంచుకుంది. అప్పటికి తన వయసు 13 సంవత్సరాలే కావడం గమనార్హం. స్కూల్ చదువు కూడా పూర్తి చేయని ఈ కుర్రాడిపై రాయల్స్ ఏకంగా రూ.1.10 కోట్లు పెట్టింది. ఇదేం విడ్డూరం అని అందరూ ఆశ్చర్యపోతుంటే.. 14 ఏళ్ల వయసులో అతడితో ఐపీఎల్ మ్యాచ్ ఆడించి ఐపీఎల్ అభిమానులకు పెద్ద షాకిచ్చింది రాజస్థాన్. అతను బలమైన బౌలింగ్ లైనప్ ఉన్న గుజరాత్ టైటాన్స్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. టైమింగ్, శక్తిని జోడించి సిక్సర్ల మోత మోగిస్తూ కేవలం 35 బంతుల్లోనే సెంచరీ కొట్టేశాడు. ఆ ఇన్నింగ్స్ నిరుడు ఐపీఎల్‌కే హైలైట్‌గా నిలిచింది. ఆ సీజన్లో మొత్తంగా 7 మ్యాచ్‌ల్లో 252 పరుగులతో తన సత్తా ఏంటో చూపించాడు వైభవ్. తన స్ట్రైక్ రేట్ 206.55 కావడం విశేషం. ఐపీఎల్ అయ్యాక అండర్ 19 జట్టులో తన మెరుపులను కొనసాగించాడు వైభవ్. ఆస్ట్రేలియా పర్యటనలో నాలుగు రోజుల మ్యాచ్ ఆడుతూ 58 బంతుల్లోనే సెంచరీ కొట్టేసిన సూర్యవంశీ.. ఏసీసీ అండర్ 19 ఆసియా కప్‌లో నిలకడగా రాణించాడు. ఆపై ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో యూఏఈపై కేవలం 42 బంతుల్లోనే 144 పరుగులు సాధించి ప్రకంపనలు రేపాడు. ఆ మ్యాచ్‌లో అతను 32 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేయడం విశేషం. ఇక ఈ ఏడాది ఆరంభంలో అండర్ 19 వన్డే ప్రపంచకప్‌లో ప్రదర్శనతో మరోసారి తన పేరు ప్రపంచ క్రికెట్లో మార్మోగేలా చేశాడు. ఫైనల్లో ఆస్ట్రేలియాపై 80 బంతుల్లోనే 175 పరుగుల ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను ఏకపక్షం చేసేశాడు. ఆ ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, 15 సిక్సర్లు బాదడం విశేషం. ఇలాంటి ఫామ్‌తో ఐపీఎల్‌లో అడుగుపెడుతుండడంతో అతడిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కలిసొచ్చిన రోజు డబుల్ సెంచరీ కూడా కొట్టేసి చరిత్ర సృష్టిస్తాడేమో అన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**సవాళ్లకు సిద్ధమేనా?......** నిరుడు ఐపీఎల్‌లో ఆడినప్పుడు వైభవ్‌ను చిన్న పిల్లాడిలాగే చూశారు. తన మెరుపు సెంచరీ చూసి, ఫ్లాట్ పిచ్‌పై అన్నీ కలిసొచ్చి ఒక ఇన్నింగ్స్ ఆడేశారు అని కామెంట్లు చేసిన వాళ్లూ లేకపోలేదు. కానీ అతను ఏడాది పాటు అండర్ 19 క్రికెట్లో నిలకడగా రాణించాడు. తన మెరుపులు గాలివాటం కాదని రుజువు చేశాడు. కేవలం బలంతో షాట్లు ఆడట్లేదని, తన దగ్గర టెక్నిక్ కూడా ఉందని చూపించాడు. అయితే అండర్ 19 స్థాయిలో గొప్ప బౌలర్లు ఉండరని.. వాళ్లు తన స్థాయికి తగకపోవచ్చని.. కానీ ఐపీఎల్‌లో ఈసారి మేటి బౌలర్లను ఎదుర్కొంటూ నిలకడగా రాణించడం అంత తేలిక కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏడాదిగా తన ఆటను అన్ని జట్లూ గమనిస్తూ ఉంటారని.. వీడియో విశ్లేషణలతో తన బలహీనతలను గుర్తించే ఉంటారని.. కాబట్టి అతను సవాళ్లకు సిద్ధంగా ఉండాలని సూచిస్తున్నారు. ఒక వ్యూహం ప్రకారం వైభవ్‌ను ఔట్ చేయడానికి బౌలర్లు చూస్తారు కాబట్టి వైభవ్ జాగ్రత్తగా ఉండాల్సిందే. ఏడాదిగా తన ఆట చూస్తున్న వాళ్లు.. అతడికి టీమ్‌ఇండియాలో చోటివ్వాలని డిమాండ్లు కూడా చేశారు. కానీ ఇది తొందరపాటే అవుతుందనే అభిప్రాయాలూ వ్యక్తమయ్యాయి. ఆటలో పరిణతి అవసరం కాబట్టి ఇంకా సమయం తీసుకోవాలనే చర్చ జరిగింది. అయితే ఐపీఎల్‌లో వరుసగా రెండో సీజన్లో రాణించాడంటే మాత్రం వచ్చే టీ20 ప్రపంచకప్ లక్ష్యంగా భారత జట్టులోకి తీసుకొచ్చే అవకాశాలను కొట్టిపారేయలేం. మరి ఈసారి ఐపీఎల్‌పై సూర్యవంశీ ఎలాంటి ముద్ర వేస్తాడో చూడాలి.

